J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 9 31.7.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# దిగొచ్చిన ప్రధాని దిగిపోయిన ప్రధాన్



## యువతరం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది!

- ఉప్పెనలా ఎగసిన జెన్‌జీ ఉద్యమం
- యువత డిమాండ్లకు తలొగ్గిన కేంద్రం
- రాజీనామా చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర
- పుష్కరకాల పాలనలో మోడీకి తొలి ఎదురుదెబ్బ

*ఔరా ఏం తెగువ, ఏం విశ్వాసం, తిమ్మినిబమ్మిని చేయగలిగిన నాయకులకే చుక్కలు చూపించారు. జగమొండి మోడీనే గజగజలాడించారు. హస్తినను కారుమేఘంలా కమ్మేసి కేంద్రాన్నే వణికించారు. తన పదవీకాలంలో ఒక్క మీడియా సమావేశాన్నీ ఏర్పాటు చేయని మోదీ చేతే సెల్ఫీ వీడియోలతో యువతరానికి జైకొట్టించారు. ముచ్చటగా తమ మూడు డిమాండ్లనూ నెరవేర్చుకుని జెన్‌జీ నా మజాకా అనేలా సత్తా చాటారు.*

ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో జెన్‌జీ చేపట్టిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యతిరేక ఉద్యమం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా వామనుడి తరహాలో ప్రారంభమై, బ్రహ్మాండాన్నే ఆక్రమించిన విశ్వరూపధారి స్థాయికి చేరుకుని ఏకంగా కేంద్రమంత్రి పదవి నుండి దిగిపోయేలా చేసింది. నీట్ రద్దుతో బలవన్మరణానికి పాల్పడిన యువ అభ్యర్థుల ఆత్మకు శాంతి చేకూరేలా చేసి, వారి కుటుంబాలకు న్యాయం దక్కేలా చేసింది. ఈ క్రమంలో విద్యార్థులు, యువత చూపిన అసమాన పోరాటపటిమ భావిభారతావని ఎదురు చూస్తున్న 'భారత రాజకీయాల్లో యువ విద్యావంతులు' అన్న నినాదానికి ప్రాణం పోస్తుందా? అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

అనుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో భారతీయులకు ఉద్యమాలే ఊపిరి. పోరాటాలే ప్రాణం. మనలోని ఆ తెగువే 200 ఏళ్లు పరిపాలించిన తెల్లదొరలను దేశం నుంచి తరిమి కొట్టేలా చేసింది. అందులో భగత్ సింగ్ త్యాగం, నేతాజీ పౌరుషం, గాంధీజీ అహింసా వాదంతో పోరాటం అనన్యసామాన్యం. సరిగ్గా ఇవే లక్షణాలు ప్రస్తుత జన్‌జీ తరంలోనూ కనిపిస్తున్నాయి. అన్యాయం జరిగితే వేగుచుక్కలై స్ఫూర్తినింపడం, నిప్పుకణికలై ముందుకురకడం, కణ కణ మండే అగ్నిజ్వాలై ఎగసిపడడం నేటి యువతకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే ఏ నాయకుడి అండా కోరకుండా, ఎవరో వస్తారు... ఏదో చేస్తారని కూర్చోకుండా.. ఏ మీడియా సపోర్టు ఆశించకుండా.. మనకు మనమే.. మన దారి

2లో



# దిగొచ్చిన ప్రధాని.. దిగిపోయిన ప్రధాన్

(మొదటిపేజీ తరువాయి)

మనదే అన్నట్లుగా.. చిన్నగా నిరసన ప్రారంభించి.. మహోద్యమంగా మార్చి.. కాకలు తీరిన నాయకులనే ఖంగు తినిపించారు. ఎవరి ఒత్తిడికి తలొగ్గం అన్న వారినే జీహుజూర్ అనేలా చేశారు. ఎదురులేదు అనుకున్న వారికే ఎదురొడ్డి నిలిచారు. రీల్స్ చేయడంలోనే కాదు రియల్ లైఫ్‌లోనూ హీరోలే అని నిరూపించారు. వారి పోరాట స్ఫూర్తికి దేశ ప్రధానే దిగొచ్చారు. కేంద్రమంత్రే పదవిని వదులుకొని దిగిపోయారు. భారతాన నవశకానికి నాంది పలికిన ఈ ఉద్యమం భవిష్యత్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చుతుందా? కొత్త నాయకత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుందా? అన్న చర్చ ఇప్పుడు సర్వత్రా సాగుతోంది.

## ఉద్యమ నేపథ్యం ఇదీ...!

2026 మే 3న నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షను ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా రద్దు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన ఈ పరీక్ష లోపభూయిష్టంగా ఉందంటూ అభ్యర్థులు, యువత, విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు దుమ్మెత్తి పోశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మంది హాజరయ్యే పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ ఎగ్జామ్ మాకొద్దంటూ 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అభిజిత్ దీప్కే ఏర్పాటు చేసిన 'కాక్రోచ్ జనతాపార్టీ' బాధిత విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు దేశంలో విద్యా రంగాన్ని సంస్కరించాలని.. ఈ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్‌ని లేవదీసింది. ఆత్మహత్యకు పాల్పడిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పించాలని కోరింది. తమ డిమాండ్ల సాధనే ధ్యేయంగా జూన్ 6న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఉద్యమానికి పిలుపునిచ్చింది. సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించి ఏకంగా నిరాహార దీక్షకు దిగడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. వేలాదిమంది జెన్‌జీ యువత, నీట్ బాధితులు, వారి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున జంతర్ మంతర్ వద్దకు చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మహాధర్నాలతో హోరెత్తించారు.

## లాఠీ దెబ్బలకు వెరవక కేసులకు బెదరక..!

ఇక ఉద్యమంలో జెన్‌జీ యువత చేపట్టిన నిరసన ప్రదర్శనలు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయంటే అతిశయోక్తి కాదేమో. ముఖ్యంగా జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు నిరసనకారులు చేపట్టిన మార్చ్ తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. ఢిల్లీ పోలీసులు నిరసనకారులపై లాఠీచార్జ్ చేయడం, కొందరు విద్యార్థుల తలలు పగడం, పెద్దసంఖ్యలో గాయాలపాలు కావడం వంటి విషయాలు మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ మీడియాలోనూ ప్రముఖంగా ప్రసారమయ్యాయి. వివిధ దేశాల ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థుల నిరసనలను ప్రపంచానికి చూపడం విశేషం. ఇక ఉద్యమకారులు సైతం తమను చితకబాదిన పోలీసుల ఎదుటే మళ్లీ దీక్షకు కోర్చోవడం, వారి ఎదుటే నినాదాలు చేయడం, బ్యాడ్మింటన్, క్రికెట్, హస్తకళలు, నృత్యాలు చేస్తూ నిరసనలు తెలియజేయడం. ఉద్యమ ప్రదేశాన్నే వాకింగ్ ట్రాక్‌లా ఉపయోగించడం, పాటలు, ఆటలతో తమ మనోగతాన్ని వివరించడం, పోలీసులు చుట్టుముట్టి కొడుతున్నా ఇంకా కొట్టండి.. ఇంకా కొట్టండి.. ప్రజాస్వామ భారతంలో ప్రభుత్వం విద్యార్థులకిస్తున్న బహుమతి భేష్... భేష్ అంటూ పోలీసులకే సవాల్ విసరడం వంటి దృశ్యాలు భావి భగత్‌సింగ్‌లు భారత్‌లో ఉద్భవించారా? అనే కామెంట్లు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఇక విద్యార్థినులు సైతం పోలీసులను నెట్టుకుంటూ, అరెస్టు చేసి తీసుకెళ్తున్న తమ సహచరులను కాపాడేందుకు పోలీసుల వాహనాలకు అడ్డుగా నిలబడి తమలో ఝాన్సీ లక్ష్మీబాయ్, రాణి రుద్రమదేవి తెగువ ఉందంటూ చాటడం కూడా విశ్లేషకులు, విమర్శకులను సైతం ఆలోచింపజేసింది. ఇక సినీరంగానికి చెందిన ప్రముఖులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ మతాలకు చెందిన నాయకులు కలిసికట్టుగా విద్యార్థులు, జెన్‌జీ ఉద్యమకారుల వెంట నడిచి వారికి భోజనం, తాగునీరు, వైద్యశిబిరాలు వంటి సదుపాయాలను కల్పించి ఉద్యమ బలోపేతానికి కారణమయ్యారు. ఇక ఢిల్లీ ఉద్యమ స్ఫూర్తితో మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో నిరసనలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ముఖ్యంగా బీహార్‌లో యువత పోలీసులు పెట్టిన బారికేడ్‌లతోనే స్కేటింగ్ తరహాలో ర్యాలీలు తీయడం, జలఫిరంగులనే వాటర్ ఫౌంటేన్ తరహాలో ఎంజాయ్ చేయడం, టియర్‌గ్యాస్ ప్రయోగించరా అంటూ పోలీసులనే ఎద్దేవా చేయడం, తాడుతో తమను అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులతోనే, అదే తాడుతో సయ్యాటలు ఆడడం వంటి వింత, వినూత్న నిరసనలతో ఆకట్టుకున్నారు. ఇక హస్తిన ఉద్యమం దేశవ్యాప్తం అవుతుందనే ప్రచారంతో కేంద్ర దిగివచ్చి ఉద్యమానికి సారథ్యం వహించిన ప్రతినిధులతో చర్చలు జరిపింది.

## యువతరం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది!

ఈ జెన్‌జీ ఉద్యమంతో దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా సైతం తమ ఇమేజ్ డ్యామేజ్ కావడంతో కేంద్ర ప్రభుత్వం తన పట్టును సడలించింది. నిరసనకారుల డిమాండ్లను నెరవేర్చాలని నిర్ణయించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను భేషరతుగా కొట్టివేస్తామని ప్రకటించింది. భవిష్యత్‌లో వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చింది. ఇక అత్యంత ముఖ్యమైన అంశం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని పదవి నుంచి తొలగించాలని నిర్ణయించడం. ఆ వెంటనే మోదీ సూచనలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఫలితంగా జెన్‌జీ ఉద్యమం సుఖాంతమైంది. ఈ పరిణామాన్ని దేశంలో గొప్ప ప్రజాస్వామ్య విజయంగా రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే అత్యంత ఇబ్బందికర, ఉద్రిక్త పరిస్థితులు ఎదురైనా, అటు కాక్రోచ్ పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, జెన్‌జీ యువత ఏమాత్రం హద్దు మీరకుండా, అదుపు తప్పకుండా శాంతియుతంగానే తమ నిరసనను కొనసాగించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా మొండి పట్టుదలకు పోకుండా పట్టు విడుపు ధోరణితో వ్యవహరించడం వల్ల సమస్యకు రాజ్యాంగబద్ధ పరిష్కారం లభించే అవకాశం దక్కింది. లేకుంటే మొదటి నుంచి పలువురు విశ్లేషకులు భావించినట్లు విద్యార్థుల ఉద్యమంలో అసాంఘిక శక్తులు, విదేశీ శక్తులు చొరబడి విధ్వంసం సృష్టించి ఉంటే అమాయకులైన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయేవారు. అదే సమయంలో కేంద్రం ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉన్నా, హస్తిన ధర్నా దేశమొత్తం పాకి, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక తరహాలో తీవ్ర హింసకు కారణమై పాలకుల గద్దె దించే పరిస్థితి వచ్చి ఉండేదేమో అన్న అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. అటు యువత, ఇటు పాలకులు పరిణితి చెందిన వ్యవహారశైలిలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించడమే కాకుండా బాధితులకు న్యాయం చేకూర్చేందుకు నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామంగానే భావించాల్సి ఉంటుంది.

ఏదేమైనా ఎదురులేని నేతగా తాను ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతున్న మోదీ పాలనకు ఈ జెన్‌జీ ఉద్యమం ఓ తీవ్రమైన హెచ్చరిక అన్నది మాత్రం ఎవరూ కాదనలేని సత్యం. రాజకీయ నాయకులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, సినిమా రంగ ప్రముఖులు ఇలా ప్రజలను ప్రభావితం చేసే ఏ రంగానికి చెందిన వ్యక్తులైనా, ప్రభుత్వంపై విరుచుకుపడితే.. అదేస్థాయిలో కౌంటర్ ఇచ్చి కేసులతో భయపెట్టే ఎన్డీయే ప్రభుత్వ పెద్దలు తొలిసారి ఆత్మరక్షణ ధోరణితో వ్యవహరించడం, గత పుష్కర కాలం దేశ రాజకీయాల్లో ఇదే ప్రథమం. ఈ నేపథ్యంలో ఇకనైనా వ్యవస్థలో చోటు చేసుకుంటున్న తప్పులకు ఎప్పటికప్పుడు చెకచెప్పి యువతరమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలను తమ పనితీరుతో మెప్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అనడంలో సందేహం లేదు. అలా కాకుండా గతంలోలాగే నియంతృత్వ పోకడలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించక తప్పదనే విషయం ఈపాటికే కేంద్ర పెద్దలకు అవగతమై ఉంటుందనడంలో సందేహం లేదు. ఏదేమైనా జెన్‌జీల ఉద్యమం దేశంలో నవశకానికి నాందిపలికి విద్యారంగాన్ని సంస్కరించే బాధ్యతను భుజాలకెత్తుకుంది. ఈ తొలిదెబ్బతోనే తన పవర్ చూపించి పవర్‌లో ఉన్నవారికి ముచ్చెమటలు పట్టించింది. మొక్కవోని దీక్షతో అనుకున్నది సాధించడంతో "యువతరం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది". జై హింద్..!

# వీఎస్‌యులో ఇంజనీరింగ్ కళాశాల

విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. అందుకు సహకరించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కి కృతజ్ఞతలు చెప్తున్నామన్నారు. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగాల్లో తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. ఒక్కో విభాగంలో 60 మంది చొప్పున 240 మంది విద్యార్థులకు ప్రవేశాలు జరుగుతాయని, బీసీ విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు.

# విజయవంతంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ

## 85.28% ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశామన్న కలెక్టర్



జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈనెల 27న ఆయన కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని, ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్‌ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 38,645 డూప్లికేట్ ఓట్లు (1.96 శాతం) గుర్తించామని, సంబంధిత ఓటర్ల అంగీకారంతో వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే 1,13,421మంది (5.75 శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారిగా, 80,699 మంది(4.09 శాతం) మరణించిన వారిగా, 57,077మంది (2.89 శాతం) అందుబాటులో లేనివారిగా గుర్తించినట్లు వివరించారు. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి అవసరమైన ఆధారాలు సమర్పిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈనెల 31వతేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. డ్రాఫ్ట్ ప్రచురణ అనంతరం 30 రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించి సవరించుకోవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడటమే భారత ఎన్నికల సంఘం లక్ష్యమన్నారు.

## వానలు బాగా కురవాలంటూ ..

# జొన్నవాడలో వైభవంగా సహస్ర ఘటాభిషేకం




ఘటాభిషేకానికి నది నుండి పవిత్ర జలాలను తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ నిర్వాహకులు

రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో బుధవారం సహస్ర ఘటాభిషేక మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అర్చక స్వాములు, వేద పండితులు శాస్త్రోక్తంగా నది నుంచి మట్టిని, ఘటాలలో జలాన్ని నింపుకొని, శివనామస్మరణలతో, భజనలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీ మల్లికార్జున స్వామివారికి సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. పవిత్ర జలాలతో అభిషేకం జరుగుతున్న సమయంలో భక్తుల "ఓం నమః శివాయ", "హర హర మహాదేవ" నినాదాలతో ఆలయం మారుమోగింది. అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో దేవస్థానం ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

# చంద్రశేఖర్‌రెడ్డి ప్రతిభకు.. కేంద్రం గుర్తింపు

- ఛేంజ్‌మేకర్ బ్యాడ్జిని అందుకున్న లెక్కలమాస్టారు




నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం చిలకలమర్రిలోని జడ్పీ హైస్కూల్ లెక్కలమాస్టారు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యున్నతమైన 'ఛేంజ్‌మేకర్' బ్యాడ్జిని అందుకున్నారు. ఈ విషయాన్ని 'మై గావ్' సంస్థ బుధవారం తనకు తెలియజేసినట్లు ఆయన చెప్పారు. కేంద్రప్రభుత్వం నిర్దేశించిన మైగావ్ పోర్టల్‌ద్వారా నిర్వహించే క్విజ్‌లు, సర్వేలు మరియు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న చంద్రశేఖర్‌రెడ్డి, 1,01,100 క్విజ్ పాయింట్లు సాధించి 'ఛేంజ్‌మేకర్'బ్యాడ్జిని సాధించడం విశేషం. ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు గడిచిన కొన్నేళ్లుగా My Gov, మిషన్ కర్మయోగి వేదికల ద్వారా దేశ నిర్మాణంలో క్రియాశీల భాగస్వాములవుతున్నారు. కేంద్రప్రభుత్వం నుంచి అరుదైన ఘనతను అందుకున్న ఆయనను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

# శత జయంతి

## నీరాజనాలు



కీ॥శే॥ రేబాల కోదండరామిరెడ్డి గారు
05.08.1926 - 11.08.1978

నార్తు మోపురు, నెల్లూరు జిల్లా

మనందరికి మార్గదర్శకులు,
సమాజానికి ఆదర్శప్రాయులు,
సేవా తత్పరతకు ప్రతిరూపం,
సత్ప్రవర్తనకు చిరస్మరణీయులు

కీ॥శే॥ రేబాల కోదండరామిరెడ్డి గారి

## నూరవ జయంతి

తేదీ: 05.08.2026

సందర్భంగా మిమ్ములను స్మరించుకుంటూ
ఎల్లపుడు మీ దీవెనలు కోరుకుంటూ

### కుటుంబ సభ్యులు

| | |
|---|---|
| భార్య | : శ్రీమతి రేబాల సత్యవతమ్మ |
| కొడుకు - కోడలు | : శ్రీ రేబాల కిషోర్ కుమార్ రెడ్డి - శ్రీమతి రేబాల ప్రసూన రెడ్డి |
| మనవడు | : శ్రీ రేబాల సాయి పృథ్వీ రామి రెడ్డి - శ్రీమతి రేబాల నిఖితా రెడ్డి |
| మనవరాలు | : శ్రీమతి కావల్ రెడ్డి సాయి పూజిత రెడ్డి - శ్రీ కావల్ రెడ్డి కార్తీక్ రెడ్డి |
| ముని మనవడు - ముని మనవరాలు | : రేబాల సాయి అశ్వథ్ రామ్ రెడ్డి - కావల్ రెడ్డి స్మైరా రెడ్డి |

"వెలుగునిచ్చే దీపం ఆరిపోయినా, దాని వెలుగు ఎన్నో హృదయాల్లో శాశ్వతంగా నిలుస్తుంది."

లాయర్
జులై 31, 2026

# తల్లి పాలే..బిడ్డకి అమృతం!

తల్లి పాలు బిడ్డకి అమృతం అన్నారు పెద్దలు. ఇది ఎంతో అనుభవంతో చెప్పిన మాట. ఏ తల్లయినా బిడ్డకి పాలివ్వడం అనేది సహజం. అది ప్రకృతి ధర్మం కూడా. అయితే నేటి ఆధునిక జీవనశైలిలో అందుకు పెద్ద సవాళ్లే ఎదురవుతున్నాయి. నిత్యం యాంత్రిక జీవనంలో, ఉద్యోగాల ఆరాటంలో, పని వత్తిడులలో అనేకమంది తల్లులు బిడ్డలకు పాలివ్వడంలో అశ్రద్ధ చూపుతున్నారనే అధ్యయనాలు సమాజాన్ని నివ్వెరపరుస్తున్నాయి. బిడ్డ జీవితానికి ప్రాణప్రదమైన, అత్యంత ఆరోగ్యదాయకమైన తల్లిపాలు సక్రమంగా లభించక ఎందరో శిశువులు అనారోగ్యాల పాలుకావడమో లేదా మృత్యుఒడిలోకి జారిపోవడమో జరిగిపోతోందని నిపుణులు చెప్తున్నారు. సాధారణంగా, బిడ్డ జన్మించిన తొలి గంటలోనే తల్లి పాలు తాగడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, ఆ తర్వాత పోషకాహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలు తాగడం బిడ్డ ఆరోగ్యానికి ఒక పెద్ద రక్షణ కవచమని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా స్పష్టం చేస్తోంది. శిశువు పుట్టాక, శారీరక-మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయని, అనారోగ్యాలకు, ఇన్‌ఫెక్షన్లకు, వైరస్‌లకు గురికాకుండా ఉండేందుకు, బిడ్డ ఆయువుని, ఆరోగ్యాన్ని పెంచే తల్లి పాలు నిజంగానే అమృతం లాంటివని శాస్త్రవేత్తలు కూడా నిర్ధారించారు. అది సిజేరియన్ అయినా..సాధారణ ప్రసవమైనా సరే..బిడ్డకు తొలిగంటలోనే పాలు (ముర్రుపాలు) ఇవ్వడం ద్వారా బిడ్డ భవిత ఆరోగ్యప్రదంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. అంతే కాదు, బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీబిడ్డల అనుబంధం, ఆత్మీయత, ప్రేమానురాగాలు మరింతగా దృఢపడతాయి. ఈ సృష్టిలో కల్తీ లేని వాటిలో తల్లిపాలు కూడా ఒకటి. అందుకే బిడ్డకి అమ్మపాలు అమృతం అవుతున్నాయి. బిడ్డకు పాలిస్తే బిడ్డకే కాదు..ఆ తల్లి ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇవన్నీ అందరికీ తెలిసినవే అయినా, పాలిచ్చే తల్లుల పట్ల చాలా కుటుంబాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మరికొందరికేమో.. ఎక్కువ రోజులు పాలు ఇస్తే తమ అందం-ఆరోగ్యం ఎక్కడ సన్నగిల్లిపోతాయోననే అనే అనుమానం, లేనిపోని అపోహలు కూడా కొందరు తల్లుల్లో ఉంటున్నాయని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అపోహలు వద్దనే వద్దని..బిడ్డకి పాలిస్తే తల్లి ఆరోగ్యం బాగుండడమే కాక, మాతృత్వంలోని మాధుర్యానికి చేరువయ్యే మధురక్షణాలను కోల్పోవద్దని కూడా నిపుణులు సలహా ఇస్తున్నారు. నేటి యాంత్రిక జీవితంలో నిద్రమంచం లేచింది మొదలు ఉద్యోగాలకు పరుగులు తీయడం, పనుల వత్తిడి, తల్లులకు అవసరమైనన్ని రోజులు ప్రసూతి సెలవులు లేకపోవడం, అనేక కార్యాలయాల్లో బిడ్డలకు పాలిచ్చేందుకు అనువైన ప్రత్యేక గదులు ఉండకపోవడం వంటి అసౌకర్యాలతో చాలామంది శిశువులు తల్లిపాలకు దూరమవుతూనే ఉన్నారని వైద్యనిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగాలకి వెళ్ళే అనేకమంది తల్లులు విధిలేని పరిస్థితుల్లో తమ శిశువులకు సీసా పాలు, లేదా డబ్బాపాలతోనే పాలు పడుతున్నారు. అందువల్ల బిడ్డలకి ఎన్నోరకాల ఇన్‌ఫెక్షన్లు, అనారోగ్యాలు కలుగుతున్నాయి. బయటనుంచి ఇచ్చే పోత పాలు వల్ల శిశువులకు అవి సరిగా అరుగుదల కాక శిశువులు ఇబ్బందులు పడుతుంటే, తల్లులు మౌనంగా కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. ఈ బాధలన్నిటినీ గమనించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణుల ఆరోగ్యరక్షణకి.. మాతాశిశు సంరక్షణకి - సంక్షేమానికి ఎన్నోవిధాలుగా సేవలందిస్తున్నాయి. అనేక పథకాలను వారికోసం అమలుచేస్తున్నాయి. ముఖ్యంగా భారత జాతీయ ఆరోగ్య మిషన్, దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాల వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు తరచూ ఆయా ప్రాంతాల్లో గర్భిణుల ఇంటింటికి వెళ్ళి ఆరోగ్యవిషయాల పట్ల, బిడ్డలకు పాలివ్వడం పట్ల ముందస్తు అవగాహన కల్పిస్తున్నారు. తల్లి పాలే బిడ్డకి సంపూర్ణ పోషకాహారమని, అదే వారికి జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరిస్తుందని తెలియజెప్తున్నారు. దీంతో, ఇటీవలి కాలంలో కొంతమార్పు వచ్చింది. ఈ నేపథ్యంలో, ఒక్క మన దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా ఆగస్టు 1 నుంచి తల్లి పాల వారోత్సవాలు కూడా నిర్వహిస్తూ గర్భిణులను, తల్లులను ఆరోగ్యవిషయాల పట్ల మరింత చైతన్యవంతం చేస్తున్నారు. ఈ ఏడాది 'శిశువులకి జీవితంలో ఉత్తమ ప్రారంభంగా తల్లి పాల ప్రాధాన్యతను తెలియజేయడం' అనే థీమ్‌తో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తల్లి బాగుంటే బిడ్డ బాగుంటుంది. తల్లీబిడ్డ బాగుంటే ఆ కుటుంబం బాగుంటుంది. కుటుంబం బాగుంటే సమాజం, సమాజం బాగుంటే దేశం అన్నీ బాగుంటాయి. అన్ని అవరోధాలను అధిగమించి దేశ ప్రగతికి-సౌభాగ్యానికి ఆరోగ్యకరమైన బిడ్డలనందించే మాతృమూర్తులకి మన సమాజం ఎప్పటికీ రుణపడే ఉంటుంది.

(ఆగస్టు 1 నుండి 7 వరకు 'తల్లిపాల వారోత్సవాలు')

# ఆత్మనిర్భర భారత్‌కి సరికొత్త దిక్సూచి

మనసులో మాట 108

ఒకప్పుడు అంతరిక్ష సాంకేతికత లేదా అత్యంత క్లిష్టమైన రక్షణ రంగ పరికరాల ఉత్పత్తి అనగానే కేవలం ప్రభుత్వ పరిశోధనా సంస్థలు లేదా విదేశీ దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడే పరిస్థితి భారతదేశంలో దశాబ్దాల పాటు ఉండేది. విదేశాల నుంచి క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెచ్చుకోవడానికి అనేక అంతర్జాతీయ ఒప్పందాలు, నిబంధనలు, ఆంక్షల చట్రంలో భారత్ ఎంతో పోరాడాల్సి వచ్చేది. కానీ, గత ఐదారు ఏళ్లలో ఈ గమనం పూర్తిగా ఊహించని రీతిలో మారింది. నేడు భారతదేశం "స్వయం సమృద్ధి" దిశగా అత్యంత వేగంగా అడుగులు వేస్తూ, 'ఆత్మనిర్భర భారత్' ఆశయాలను క్షేత్రస్థాయిలో సాకారం చేసుకుంటోంది. ప్రభుత్వ నిబంధనల సరళీకరణ, దేశీయ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడం వల్ల భారత అంతరిక్ష, రక్షణ రంగాలు ఒక విప్లవాత్మకమైన మార్పుకు వేదికగా మారాయి. ఈ సరికొత్త సాంకేతిక విప్లవానికి అత్యుత్తమ నిదర్శనంగా హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్' రూపొందించిన 'విక్రమ్' రాకెట్ విజయం నిలిచింది.

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా ఎంతో దూరదృష్టితో స్థాపించిన స్కైరూట్ ఏరోస్పేస్, భారతీయ ప్రైవేట్ అంతరిక్ష రంగానికి సరికొత్త దిశను చూపిస్తూ చరిత్ర సృష్టించింది. విక్రమ్-1 రాకెట్ కేవలం ఒక సాంకేతిక సాధనం మాత్రమే కాదు; అది భారత్‌లోని యువ పారిశ్రామికవేత్తల ఆలోచనా శక్తులకు, ప్రతిభకు అద్దం పట్టిన ఒక అద్భుతమైన సాంకేతిక మైలురాయి. పూర్తిగా భారతదేశంలోనే రూపుదిద్దుకున్న కార్బన్ కాంపోజిట్ బాడీ, అత్యాధునిక 3డి ప్రింటెడ్ ఇంజిన్లతో తయారైన ఈ రాకెట్ ప్రయోగ విజయం, మన దేశ ప్రైవేట్ రంగానికి ఉన్న సాంకేతిక పటిమను ప్రపంచానికి చాటిచెప్పింది. కేవలం ప్రభుత్వ గ్రాంట్లు లేదా విదేశీ సహాయంపై మాత్రమే ఆధారపడే రోజుల నుంచి, ప్రైవేట్ పెట్టుబడులు, స్వదేశీ నైపుణ్యంతో అంతరిక్ష పరిశోధనలు చేపట్టే స్థాయికి భారత్ ఎదిగింది. ఇస్రో అందించిన సుదీర్ఘ అనుభవం, ఇన్-స్పేస్ వంటి ప్రత్యేక వ్యవస్థలు తెచ్చిన విధానపరమైన మార్పులు ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాలకు ఒక బలమైన పునాదిగా మారాయి.

ఈ విప్లవాత్మకమైన మార్పు కేవలం అంతరిక్ష రంగానికే పరిమితం కాకుండా, దేశ రక్షణ రంగంలోకి కూడా వేగంగా విస్తరించింది. దేశీయంగానే రక్షణ ఉత్పత్తులను తయారు చేయాలనే 'మేక్ ఇన్ ఇండియా' సంకల్పం వేలాది మంది ఇంజనీర్లకు, నూతన స్టార్టప్‌లకు సరికొత్త ఆశలను, అవకాశాలను అందించింది. ధ్రువ స్పేస్, పిక్సెల్, అగ్నికుల్ కాస్మోస్ వంటి స్పేస్ టెక్ స్టార్టప్‌లు చిన్న తరహా ఉపగ్రహాలు, అత్యుత్తమ అబ్జర్వేషన్ సిస్టమ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను స్వదేశంలోనే రూపొందిస్తుంటే, రక్షణ రంగంలో టాటా, ఎల్&టీ, భారత్ ఫోర్జ్ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో పాటు వందలాది చిన్న తరహా పరిశ్రమలు స్వదేశీ క్షిపణి విడిభాగాలు, ఆర్టిలరీ తుపాకులు, అత్యాధునిక డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైనిక సాంకేతికతలను నిరంతరం అభివృద్ధి చేస్తున్నాయి. ఒకప్పుడు మనం దిగుమతి చేసుకునే రక్షణ పరికరాలను, ఈరోజు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామంటే అందులో ఈ ప్రైవేట్ భాగస్వామ్యానికి ఉన్న వాటా ఎంతో కీలకమైనది.

భవిష్యత్తు అంచనాల పరంగా చూస్తే, భారత్ అంతరిక్ష, రక్షణ వ్యాపారంలో సరికొత్త ప్రపంచ శక్తిగా అవతరించబోతోంది. రక్షణ మంత్రిత్వ శాఖ అంచనాలు, వ్యూహాత్మక ప్రణాళికల ప్రకారం, రాబోయే ఐదేళ్లలో దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ మూడు లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవడమే కాకుండా, రక్షణ ఎగుమతులు యాభై వేల కోట్ల రూపాయలను దాటే దిశగా సాగుతున్నాయి. అదే సమయంలో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం భారతదేశానికి ఉన్న స్వల్ప వాటాను దాదాపు ఎనిమిది నుంచి పది శాతానికి పెంచడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. చిన్న తరహా ఉపగ్రహాలను చాలా తక్కువ ఖర్చుతో, అనుకూల సమయంలో కక్ష్యలోకి ప్రవేశపెట్టే విక్రమ్ వంటి రాకెట్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ వ్యాపార సంస్థలను ఆకట్టుకుంటున్నాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పరిశోధన అభివృద్ధి విభాగాలలో భారత్ సరికొత్త మైలురాళ్లను అధిగమించనుంది.

మొత్తానికి, స్కైరూట్ సాధించిన విజయం చరిత్రలో నిలిచిపోవడమే కాక, దేశంలోని ఎంతో మంది నవతరం పారిశ్రామికవేత్తల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. విక్రమ్ ప్రయోగం అనేది ఒక సాధారణ విజయం మాత్రమే కాదు, అది స్వయం సమృద్ధి భారత్ దిశగా వేసిన ఒక నిరంతర ప్రయాణపు స్పష్టమైన ఆరంభం. ఆత్మనిర్భర భారత్ విధానం కేవలం మన దేశీయ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా, విదేశీ మార్కెట్లకు వినూత్న సాంకేతికతను అందించే అత్యంత విశ్వసనీయమైన సరఫరాదారుగా భారత్‌ను నిలబెడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ తరహా ప్రైవేట్ భాగస్వామ్యం భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టేందుకు బలమైన ఊతాన్ని ఇస్తుంది. యువత ఆలోచనలకు తగినట్లుగా పరిశోధనలకు నిధులు కేటాయించడం, విధానపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా దేశీయ సృజనాత్మకత మరింత వికసిస్తుంది. సరిహద్దుల రక్షణ నుండి అనంతమైన అంతరిక్ష అన్వేషణల వరకు భారత్ సాధిస్తున్న ఈ పురోగతి 'వికసిత భారత్' కలలకు నిజమైన ప్రతిరూపం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# స్వామి దర్శనం భారం... సామాన్యుడికి దూరం!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

గత వారం మన 'లాయర్'లో మొదటి పేజీలో వచ్చిన వార్త అక్షర సత్యం. తిరుమల స్వామివారి దర్శనం సామాన్యులకి అతి భారంగా మారిపోయింది. సామాన్యులకి ఆ దేవదేవుడు దూరమైపోయాడు. 'లాయర్'లో పేర్కొన్నట్లుగా అధికార ప్రముఖులకు, రాజకీయ నేతలకి, న్యాయ వ్యవస్థలోని కీలక వ్యక్తులకి మాత్రం టీటీడీ పాలకులు, అధికారులు అగ్రతాంబూలం ఇచ్చి వారికి దివ్య దర్శనం కల్పిస్తున్నారు. శ్రీవారికి కోట్లరూపాయలు ఇచ్చిన భక్తులని సైతం సామాన్య భక్తులలో కలిపేసి లఘు దర్శనానికి పరిమితం చేశారు. అక్కడ పాలక మండలితో పాటు అధికారులు తీసుకుంటున్న అర్థరహిత నిర్ణయాలకి అడ్డుకట్ట వేసే నాథుడే లేకపోవడంతో వారిది ఇష్టారాజ్యమైపోయింది. ప్రభుత్వం సమర్థవంతరమైన పర్యవేక్షణా బృందాన్ని నియమించి, పాలకమండలి తీసుకుంటున్న నియంతృత్వ నిర్ణయాలకు అడ్డుకట్టవేసేలా చర్యలు తీసుకోవాలి. వచ్చిన భక్తులకి సౌకర్యవంతమైన వసతి కల్పిస్తున్నామా, నాణ్యమైన ప్రసాదం తినిపిస్తున్నామా అన్న అంశాలు ముఖ్యం కాదు. భక్తులు సంతృప్తి చెందే స్థాయిలో ఆ ఏడుకొండలవాడి దర్శనం చేయిస్తున్నామా లేదా అన్నది ప్రధానం విషయం అని గుర్తుపెట్టుకోవాలి. ఓం నమో వేంకటేశాయ..!

లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

# నా మొదటి సైకిల్ గుర్తుకు వచ్చింది

మొదటి సైకిల్ అనేది చిన్నతనంలో ప్రతిఒక్కరి కల మరియు అత్యంత అవసరం. మొదటి సైకిల్ చేతిలో పట్టుకున్న వేళ ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. అవి మరపురాని క్షణాలు. అలాంటిది కొన్ని వేల మంది చిన్నపిల్లల కలలు సాకారం చేస్తూ వారి ప్రతి దిన అవసరాన్ని నెరవేరుస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి అవసరం తీరేలా తమ స్వంత నిధులతో సైకిల్‌ని అందించిన ఘనత మన ప్రియతమ మంత్రివర్యులు శ్రీ పొంగూరు నారాయణ గారిది. కష్టం ఎరిగిన వ్యల్లని మనసుతో చేయూతని అందించే దిశగా ఈ నూతన పథకానికి నాంది పలికారు. ఇది ఆచరణీయం. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అవసరమైన వారికి సాయం చేసేలా ఆలోచించడానికి ఇది నాంది. ఇలా ఆలోచించడం ఆచరించడం నారాయణ గారికి కొత్తేమీ కాదు. అవసరమైన వారికి ఆపన్నహస్తం అందించడం ఆయన ఎదుగుదలకు ముఖ్యకారణం. నెల్లూరు రూపురేఖలు మార్చే సంకల్పంతో వేలకోట్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టి, అంచెలంచెలుగా నెల్లూరు చిత్రపటాన్ని మార్చడంతో పాటు, పిల్లల అవసరాలు తీర్చే ఈ ముందడుగు వేయడమే కాకుండా ప్రతి ఒక్కరూ ఇళ్లకు చేరుకునే వరకు ప్రాంగణంలోనే ఉండి స్వయంగా పర్యవేక్షించారు. నెల్లూరు చరిత్రలో ఆయన పేరు సువర్ణ అక్షరాలతో ముద్రించగల ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

ఇకపోతే, సైకిల్ తీసుకొని ఇంటికి వెళ్తున్న పిల్లల్ని చూస్తుంటే నా చిన్నతనంలో ఉత్సాహంగా కొనుక్కున్న మొదటి సైకిల్ నాకు గుర్తుకు వచ్చింది. అదేపనిగా నాన్నతో వెళ్ళి సైకిల్ కొనుక్కొని అరకొరగా నేర్చుకున్నందు వల్ల ట్రాఫిక్‌లో తొక్కడానికి భయంతో నడిపించుకుంటూ ఇంటికి తీసుకెళ్లిన రోజులు మదిలో మెదిలాయి. అలాంటిది కొన్ని వేల మంది ఆనందాన్ని ఆస్వాదించడం ఒక తియ్యని అనుభూతి. సైకిల్ తీసుకున్న ప్రతి చిన్నారి సురక్షితంగా, ట్రాఫిక్‌లో జాగ్రత్తగా వాడుకోవాలని ఆకాంక్ష.

వాస్తు సతీష్ చంద్ర, నెల్లూరు.

# ప్రభుత్వ బడులకు మహర్దశ

## • ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థినులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఇటీవల నిర్వహించిన మెగా పీటీఎం (పేరెంట్స్-టీచర్స్ మీటింగ్) సత్ఫలితాల నిస్తోందని, మంత్రి లోకేష్ సారధ్యంలో ప్రభుత్వ బడులకు మహర్దశ వస్తోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో ఉన్న మహాత్మా జ్యోతీ రావు పూలే గురుకులపాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో పాల్గొని, ఇంటర్ విద్యార్థులకు విద్యాసామగ్రిని, హాస్టల్ కిట్‌లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆరు కొత్త జూనియర్ కళాశాలలు మంజూరు కాగా, అందులో ఒకటి గొలగమూడి గురుకులానికి సాధించుకున్నామని, తాము కోరిన వెంటనే జూనియర్ కళాశాలను మంజూరు చేసిన మంత్రులు లోకేష్ బాబు, సవితమ్మకు ధన్యవాదాలని అన్నారు. 5వందల మందికి పైగా విద్యార్థులు ఈ గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నారని, ఈ ఏడాది ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం సంతోషదాయక మని అన్నారు. దీనికి అదనపు భవన నిర్మాణానికి రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వీలైతే ప్రభుత్వ నిధులు, లేకుంటే సీఎస్ఆర్ నిధులతోనైనా భవనాలు నిర్మిస్తామని తెలిపారు. భవన మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణ పనులు రూ. 1.04 కోట వ్యయంతో పనులు కొనసాగుతున్నాయన్నారు.

### స్కూళ్ళకి అదనపు గదులు

ఇదే విధంగా, సర్వేపల్లి నియోజక వర్గ వ్యాప్తంగా పలు స్కూళ్ల భవనాలు, అదనపు గదుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. హైస్కూళ్లలో 8,9 తరగతుల విద్యార్థినులు 1840 మందికి ఎస్ఇఐఎల్ కంపెనీ సహకారంతో సైకిళ్లు అందించామని, ఈ విద్యా సంవత్సరం లోనూ 2 వేల నుంచి 3 వేల సైకిళ్ల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామని కూడా తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే అందరికీ ఇవ్వడం పెద్ద స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని, దీంతో గిరిజనులతో పాటు నిరుపేద కుటుంబాల వారు కూడా ప్రతి బిడ్డను స్కూలుకు పంపే పరిస్థితి వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల కోసం..'కంచి' విరాళం

## • చెర్లోయడవల్లి స్కూలుకి 1.50 లక్షల సాయం




కంచి పరమేశ్వరరెడ్డికి పూలు చల్లి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రముఖ దాత.. ఆత్మకూరులోని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఇటీవల ఒకటిన్నర లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఆత్మకూరు రూరల్‌లోని చెర్లోయడవల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు-తల్లితండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు అవసరమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. నారంపేట, నాగులపాడు, చెర్లోయడవల్లి, రావులకొల్లు, అల్లీపురం గ్రామాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఆయన ఈ సాయం అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా ఈ స్కూలులో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వసతిగా ఉండేందుకు భోజనశాలను కూడా త్వరలోనే నిర్మిస్తామని చెప్పారు. తొలుత విద్యార్థులు-ఉపాధ్యాయులు ఆయన్ను పూలమాలలతో సన్మానించారు.

# విజయ డెయిరీ డైరెక్టర్ వితరణ

విజయ డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులురెడ్డి (చిన బాబిరెడ్డి) ఇటీవల తోటపల్లిగూడూరు మండలం వరిగొండ పంచాయతీలోని తట్టుగొల్లపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం వాటర్‌కూలర్‌ను వితరణగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూపోరాట యోధుడు.. అస్తమించాడు



***జిల్లాలో పేదలకు భూములివ్వాలంటూ అనేక ఉద్యమాలు చేసి, వేలాదిమంది నిరుపేదలకు ఉండడానికి గూడు కల్పించిన నేత..భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య(పముజుల దశయ్య) కన్నుమూశారు. 93 సంవత్సరాల వయోవృద్ధులైన దశయ్య తన జీవిత చరమదశలోనూ ఉద్యమాలే శ్వాసగా గడిపారు. చివరిరోజుల్లో అనారోగ్యానికి గురై నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. దీంతో పాతతరం కమ్యూనిస్టు నాయకుల్లో ఒక దిగ్గజాన్ని ఆ పార్టీ కోల్పోయినట్లయింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో ఏడున్నర దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, ప్రజానాయకుడు పముజుల దశరథరామయ్య మరణం కేవలం సీపీఐ ఉద్యమానికే కాకుండా.. నెల్లూరుజిల్లాకి కూడా తీరని లోటు. ఈనెల 27న సౌత్‌మోపూరులో ఆయన అంత్యక్రియలు జరిగాయి. తమ నేత మరణంతో ఆయన స్వస్థలమైన సౌత్‌మోపూరు గ్రామం కన్నీరు మున్నీరైంది.***

నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో పముజుల దశరథరామయ్య (దశయ్య) 1933లో జన్మించారు. చిన్న వయస్సులోనే సామాజిక అసమానతలను గమనించి వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులయ్యారు. కేవలం 18 ఏళ్ల వయస్సులోనే భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం స్వీకరించి, జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికే తన జీవితాన్ని అంకితం చేశారు. నెల్లూరురూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన దశరథరామయ్య, సాధారణ పార్టీ కార్యకర్తగా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రజల విశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేర్చుకున్నారు. గ్రామ శాఖ నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అనేక కీలక బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.

### ప్రజలకోసం అపారసేవలు :

ఉద్యమనేతగా, ప్రజాప్రతినిధిగా కూడా పముజుల సేవలు చిరస్మరణీయమైనవి. సౌత్ మోపూరు గ్రామ సర్పంచ్‌గా దాదాపు 30 సంవత్సరాలు ఆయన ప్రజల సమస్యల సాధన కోసం పోరాడారు. సర్పంచ్, ఎంపీటీసీగా దాదాపు 40 సంవత్సరాలకు పైగా ప్రజలకు అపార సేవలందించారు. అనంతరం నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడిగా ఐదేళ్ళు సమర్థవంతంగా పనిచేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా దశరథరామయ్య తీసుకున్న నిర్ణయాలు గ్రామాభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయి. ప్రముఖ నటి కళాభినేత్రి వాణిశ్రీని సంప్రదించి సౌత్‌మోపూరులో హైస్కూలు కట్టించి విద్యార్థుల భవితకు బాటలు వేశారు. పార్టీ పరంగా ఆయన..సీపీఐ జిల్లా కార్యదర్శిగా 12 సంవత్సరాలు పనిచేయడంతో పాటు, రాష్ట్ర కంట్రోల్ కమిటీ కమిషన్ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, కార్యకర్తలను తీర్చిదిద్దడంలో ఆయన విశేష పాత్ర పోషించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా దశరథరామయ్య పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. భూ పోరాటాల్లో కీలకపాత్ర పోషించి, పేదలకు భూములు అందించేందుకు అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. గతంలో జరిగిన సారా వ్యతిరేకోద్యమంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. అంతేకాదు, ప్రత్యేకించి చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటం అంతాఇంతా కాదు. చేనేతనాయకునిగా జిల్లాలోనే కాక, రెండు తెలుగు రాష్ట్రాలోనూ ఆయన పేరు మారుమ్రోగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కూడా ఆయన విశేష సేవలందించారు.

### నిష్కళంక నాయకుడు :

సీనియర్ రాజకీయనేతగా ఉన్నప్పటికీ పముజుల తన పదవులను అధికార ప్రదర్శనకు కాకుండా ప్రజాసేవకు వేదికగా మలచుకున్నారు. ఎన్నికల రాజకీయాల్లోనూ ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే, రాపూరు నియోజకవర్గం నుంచి సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ విజయం దక్కలేదు. అయినప్పటికీ, ఎన్నికల్లో ఓటమిని ఆయన ప్రజాసేవకు ఆటంకంగా భావించకుండా, మరింత నిబద్ధతతో ప్రజాఉద్యమాల్లో కొనసాగారు. దశరథరామయ్య నిరాడంబర జీవితం, నిష్కళంక రాజకీయాలు, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అచంచలమైన నిబద్ధత నేటి తరానికి ఆదర్శం. ప్రజల కోసం అంకితమైన ఉద్యమ జీవితం ఆయనది. జనం కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన పముజుల దశరథ రామయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, సేవలు, ప్రజాసంక్షేమం కోసం సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

ప్రజలకు ఆయన చేసిన నిస్వార్థసేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పిస్తోంది..'లాయర్'!

## • పముజుల దశరథ రామయ్య.. ఇక లేరు
## • కన్నీరుమున్నీరైన సౌత్‌మోపూరు

### పేద, దళితవర్గాలకి నిరుపమాన సేవలు - మంత్రి ఆనం

కమ్యూనిస్టు నేతగా, ఉద్యమాల నిర్మాతగా పముజుల దశరథరామయ్య జిల్లాలోని పేద దళితవర్గాల వారికి నిరుపమానమైన సేవలందించారని రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొనియాడారు. సౌత్‌మోపూరు గ్రామంలో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి మంత్రి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

### పెద్దదిక్కును కోల్పోయిన సౌత్‌మోపూరు - మంత్రి నారాయణ

పముజుల దశరథరామయ్య మృతితో సౌత్‌మోపూరు గ్రామం పెద్దదిక్కును కోల్పోయిందంటూ రాష్ట్ర పురపాలకమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విచారం వ్యక్తం చేశారు. ఈనెల 26న నెల్లూరు సీపీఐ కార్యాలయంలో ఉంచిన ఆయన పార్థివదేహాన్ని మంత్రి సందర్శించి నివాళులర్పించారు. సామాన్య కార్యకర్తగా సీపీఐలో ప్రవేశించి, ప్రజాసేవలో విశేష సేవలందిస్తూ..అసామాన్య నాయకునిగా ఎదిగారంటూ పముజుల సేవలను ఆయన ప్రస్తుతించారు.

### అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు - వేమిరెడ్డి దంపతులు

పముజుల దశయ్య అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడని, పేదప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. నిరుపేదల సంక్షేమానికి దశాబ్దాల తరబడి నిబద్ధతతో ఉద్యమించారని, ప్రజా పోరాటాల్లో ఆయన అగ్రగాములని అంటూ నివాళులర్పించారు. ఆయన లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వారు తెలిపారు.

### పేదల కోసం పోరాడిన నాయకుడు - ఎమ్మెల్యే సోమిరెడ్డి

సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథరామిరెడ్డి జీవితకాలం పేదప్రజల కోసం పోరాడిన నాయకుడంటూ మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 26న ఆయన నెల్లూరులో పముజుల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గతంలో సారా ఉద్యమంలో సీపీఎం నేత జక్కా వెంకయ్య, సీపీఐ నాయకుడు పముజుల దశయ్య, బీజేపీ నేత వరదయ్యలాంటి వారితో కలిసి తాను సారా వ్యతిరేకోద్యమ కమిటీ కన్వీనర్‌గా ఉద్యమాలు నడిపామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పముజుల ఉద్యమస్ఫూర్తి తనకు జీవితకాలం గుర్తుండిపోతుందన్నారు.

### పాడె మోసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

ఈనెల 27న జరిగిన పముజుల దశయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు, సీపీఐ నాయకులతో కలిసి భుజం కలిపి పాడె మోశారు. పముజుల మృతితో సీపీఐ పార్టీ ఒక పోరాట యోధుణ్ణి కోల్పోయిందన్నారు. పేదల పక్షపాతిగా ఉంటూ, నిరుపేదల హక్కుల కోసం ఆయన గళమెత్తి ఉద్యమించారంటూ..నివాళులర్పించారు.

# లక్ష్యాలను కష్టపడి సాధించండి

## • విద్యార్థులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల



విద్యార్థులకి బహుమతులందజేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరులోని డీకే డబ్ల్యు జూనియర్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్ల విద్యార్థులతో మమేకమయ్యారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. తాను కలెక్టర్ కావడానికి ఒక ప్లాన్ ప్రకారం చదివిన విధానం, లక్ష్యం కోసం కష్టపడిన తీరును విద్యార్థులతో పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. ప్రభుత్వ విద్యా అవకాశాలను పూర్తిగా వినియోగించుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో వరప్రసాద్, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 'డా.కిషోర్స్ రత్నం'లో..కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం స్కూల్-సరస్వతీనగర్‌లో విద్యార్థులు స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహించారు. సైనిక దుస్తుల్లో అతిథులను ఆహ్వానించి వందనాలు తెలిపారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల ఫోటోలను ప్రదర్శించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న నాయక్ సుబేదార్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ, గతంలో జరిగిన కార్గిల్ యుద్ధ పరిస్థితులను, తాను ఎదుర్కొన్న అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం, దేశ ఐక్యతను-సమగ్రతను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా సేవలందిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌సిసి ఆఫీసర్ మోహన్‌రెడ్డి, స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ తుహీన, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి గుణపాఠం

## • సీపీఐ నేత నారాయణ విమర్శ

ఢిల్లీలో ఇటీవల యువత చేసిన ఉద్యమం బీజేపీకి గుణపాఠం నేర్పిందని సీపీఐ జాతీయనేత కె.నారాయణ అన్నారు. సీపీఐ నాయకుడు పముజుల దశయ్య మరణించిన సందర్భంగా ఆయన ఈనెల 25న నెల్లూరుకు వచ్చి అపోలో ఆసుపత్రిలో దశయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పరిస్థితులు చల్లబడినప్పటికీ, ఢిల్లీలోని యువత ఉద్యమం బీజేపీ ప్రభుత్వ తీరుకు ఒక గొడ్డలిపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.






# నెల్లూరు కబుర్లు

### కూతురు, మనవడితో కలిసి..

# మంత్రి నారాయణ పూజలు



కూతురు షరణి, మనవడితో కలిసి మంత్రి నారాయణ ఈనెల 26న నెల్లూరులోని శివాలయం (మూలాపేట మూలస్థానేశ్వరాలయం)లో పూజలు చేశారు. రాష్ట్రం మరింత అభ్యున్నతి సాధించాలని, నెల్లూరు నగ రంలో విద్యార్థులు, చిన్నారుల చదువులు బాగుండాలని వారు ప్రార్థించినట్లు తెలిపారు.

# డీఎస్సీ అక్రమాలపై విచారణ జరగాలి

## - - - నిరసన ర్యాలీలో.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి - - -




డీఎస్సీ అక్రమాలపై విచారణ జరగాలని, లోకేష్ రాజీనామా చేయాలంటూ నెల్లూరులో వైసీపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేశారు. వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతితో పాటు విద్యార్థులకి గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఎలాంటి అర్హత లేని వారికి టీచర్ ఉద్యోగాలు కట్టబెట్టి.. విద్యావ్యవస్థ విలువలను మంత్రి లోకేష్ దిగజార్చారని మండిపడ్డారు. స్పోర్ట్స్ కోటాలో ఇచ్చిన టీచర్ ఉద్యోగాలన్నీ అక్రమమని.. దీనిపై ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. స్థానిక వీఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులను, యువతను వంచనకు గురిచేసిందంటూ వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మెగా డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.

### తలసేమియా చిన్నారులకు..

# రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సాయం

## • లక్ష విలువైన పరికరాల విరాళం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల కోసం ఈనెల 25న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున యాలమూరి రంగారావు, పామిడి మల్లికార్జునరావు, సురేంద్రలు లక్ష రూపాయల విలువైన వైద్య పరికరాలను, మందుల కోసం కొంత నగదును విరాళంగా అందజేశారు. తలసేమియా చిన్నారుల చికిత్సకు అత్యంత అవసరమయ్యే వైద్యపరికరాలు ఒక్కొక్కటి రూ.20,000 విలువ చొప్పున మొత్తం నాలుగింటిని అందజేయడమే కాక, అదనంగా చిన్నారుల మందుల కొనుగోలు కోసం 20వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట మండలానికి చెందిన తలసేమియా చిన్నారి కె.హరిప్రియకి అవసరమైన వైద్య పరికరాన్ని అందజేశారు.

### స్పాస్టిక్ సెంటర్‌లో..

## ఉచిత అడ్మిషన్లు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్లో 14 సంవత్సరాల లోపు మానసిక వికలాంగులు మరియు ఫిజికల్ ఛాలెంజ్ పిల్లలకు ఉచిత అడ్మిషన్లు ఉంటాయని స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉచిత ప్రత్యేక విద్యతో పాటు స్కూల్ బస్సు సౌకర్యం కూడా పూర్తిగా ఉచితమని, ఎటువంటి అడ్మిషన్ ఫీజు లేదా బస్సు ఛార్జీలు ఉండవని పేర్కొన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు మరిన్ని వివరాల కోసం ప్రిన్సిపాల్ ఉదయ్ భాస్కర్ ఫోన్. 8639934861లో సంప్రదించవచ్చన్నారు.

## లలితా సహస్రనామం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజారాజేశ్వరమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా 250 మంది మహిళలతో శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి వారి దేవస్థానంలో త్రయోదశి సందర్భంగా అర్చకులు ప్రదోష కాల పూజ, శ్రీ సుందరేశ్వర స్వామి వారికి, నందీశ్వరునికి అభిషేకాలు వేద పండితులు అర్చకులచే వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

### లేక్‌వ్యూ కాలనీలో

## పోలీసుల తనిఖీలు

శాంతి భద్రతల పరిరక్షణ, నేరనియంత్రణల కోసం పోలీసులు చేస్తున్న తనిఖీ (కార్డెన్ సర్చ్)లో భాగంగా, ఈనెల 26న నెల్లూరు నగరంలోని లేక్‌వ్యూ కాలనీలో పోలీసులు ఇంటింటికీ తనిఖీ చేశారు. దర్గామిట్ట ఎస్ఐ కళ్యాణ్ రాజు ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, సిబ్బంది తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పాతకేసుల్లో ఉన్న ఒక నిందితుడిని కూడా గమనించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

### సౌత్ ట్రాఫిక్

## ఇన్స్‌పెక్టర్‌గా కృష్ణారెడ్డి

నెల్లూరులోని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణారెడ్డిని నగరంలోని సౌత్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఉత్తర్వులివ్వడంతో, ఆయన ఇటీవల ఆ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేసి, 2023లో సీఐగా ఉద్యోగోన్నతి పొందారు.

## వాలీబాల్ పోటీలు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 18వ ఈషా గ్రామోత్సవ, రూరల్‌ప్రీమియర్ లీగ్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. జిల్లా వాలీబాల్ సెక్రటరీ పి.శ్రీనివాసరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొని అంతర్జాతీయ వాలీబాల్ ప్లేయర్స్ కిరణ్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, మల్లికార్జున్‌లను సన్మానించారు.

### ఉచిత ఆయుర్వేద

## వైద్యశిబిరం

నెల్లూరు, శోధన్‌నగర్‌లోని శ్రీ కృష్ణ ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈనెల 26న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ టీపీ నాయుడు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేసి, సుమారు వందమందికి పైగా రోగులకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి 30వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ వైద్యశిబిరానికి స్థానికులతో పాటు, చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల నుంచి కూడా రోగులు తరలివచ్చారు.

### 'తల్లికి వందనం'..

## జమ కాకపోతే చెప్పండి

ప్రభుత్వం ఇస్తున్న 'తల్లికి వందనం' పథకం డబ్బులు అర్హులైవరికైనా చేరకపోతే, సంబంధిత గ్రామ సచివాలయాల్లో తెలియజేయాలని ఆయా మండలాల్లోని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. అర్హులందరికీ ఈ పథకం మొత్తాలు అందేందుకు అధికారులు కృషిచేస్తున్నారని తెలిపారు.

### రుక్మిణీ-సత్యభామలకు

## తిరుమంజనం

మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలోని రుక్మిణి సత్యభామాదేవి అమ్మవార్లకు ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఇఓ జె.శ్రీనివాసారావు ఆధ్వర్యంలో ఇటీవల ఆషాఢ మాసం సారె సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు తిరుమంజనం సేవలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని-అమ్మవార్లను దర్శించుకున్నారు.

### పంటల బీమా..

## గడువు దగ్గరపడింది

జిల్లాలో పంటలసాగుకు సంబంధించి వాతావరణ ఆధారిత పంటలబీమా పథకం నమోదు గడువు దగ్గరపడిందని, జులై31తో నమోదు సమయం ముగుస్తుంది కనుక రైతులు వెంటనే దగ్గరలోని రైతు సేవాకేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి ఒక ప్రకటనలో కోరారు.





## విద్యార్థులకు అండగా..
# నారాయణ మాస్టారి సైకిళ్ల పండుగ!

**7వేల మందికి సొంత నిధులతో సైకిళ్ళు**

**బాలబాలికల కళ్ళల్లో మెరిసిన ఆనందం**

*నెల్లూరులోని వీఆర్‌సి గ్రౌండ్ సోమవారం నాడు వేలాదిమంది విద్యార్థులతో, వారి తల్లితండ్రులతో కిటకిటలాడింది. చుట్టుపక్కల ఉన్న రోడ్లన్నీ కూడా క్రిక్కిరిసిపోయాయి. మంత్రి నారాయణ కుటుంబ సభ్యులంతా కలసి సొంత ధనాన్ని వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు ఉచితంగా సైకిళ్ళు పంపిణీ చేయడంతో, ఆ విద్యార్థుల్లో ఆనందం వెల్లువెత్తింది. అందుకు కృతజ్ఞతగా "థాంక్యూ నారాయణ సార్" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ప్రాంగణమంతా మార్మోగింది. వేలాది సైకిళ్ళు, వాటిని అందుకుంటున్న విద్యార్థులు..సంతోషపడుతున్న తల్లితండ్రులు..మొత్తంగా ఆ రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా ఇదొక పండుగ జాతరలా సాగింది.*

నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్ల పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు అక్షరాలా ఆరు కోట్ల రూపాయల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. "నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు... జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను" అని ఆయన భావోద్వేగంతో చెప్పారు. ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు. "నేను నడిచి వెళ్లిన కష్టాలు ఈ తరం పిల్లలకు ఉండకూడదు. అందుకే సైకిళ్లు ఇస్తున్నాం. ఇవి కేవలం వాహనాలు కావు... మీ కలలకు చక్రాలు" అని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. తమ కుటుంబ సభ్యులతో చర్చించి రూ.6 కోట్లతో 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించామని, తొలి విడతలో 7 వేల మందికి పంపిణీ చేశామని, మిగిలిన 3 వేల మందికి జనవరిలో అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు.



### నాన్న స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు

మంత్రి కుమార్తె పొంగూరు సింధూర మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తమ తండ్రి.. కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నారని, అదే స్ఫూర్తితో పేద విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. పొంగూరు షరణి మాట్లాడుతూ నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలన్నదే తమ కుటుంబ లక్ష్యమని తెలిపారు. మంత్రి నారాయణ చేపడుతున్న కార్యక్రమాలు పేద విద్యార్థులను సాధికారత వైపు నడిపిస్తున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కొనియాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర మేయర్ సుజాత, రూరల్ ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ సమగ్రాభివృద్ధే లక్ష్యం

**ఎమ్మెల్యే కోటంరెడ్డి**



ప్రజలకి రెండేళ్ళ అభివృద్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన 19వ డివిజన్, గిలకబావి సంఘంలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి–సంక్షేమం ఇంటింటి ప్రచారం' కార్యక్రమంలో పాల్గొని రెండేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. టీడీపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలను నేరుగా కలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడంతో పాటు, ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, స్థానిక అవసరాలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మై టీడీపీ యాప్'ని
# సద్వినియోగం చేసుకోవాలి

- **పార్టీ శ్రేణులలకు..మంత్రి ఆనం పిలుపు**



ఆత్మకూరు నియోజకవర్గంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇటీవల రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన 'మై టీడీపీ యాప్‌లో రెండేళ్ల సంక్షేమ పాలన ప్రచారం నమోదు విధానం'పై అవగాహన కలిగించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను' ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, వాటికి సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పార్టీ శ్రేణులకు తెలియజెప్పారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు, లబ్ధిదారుల అభిప్రాయాలు, కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు, ప్రచార వివరాలను 'మై టీడీపీ యాప్'లో క్రమబద్ధంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకొని ప్రభుత్వ సంక్షేమ పాలనను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు.

## స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా..
# ఏపీకి 25.48 కోట్లు

**పార్లమెంటులో ఎంపీ విపిఆర్ ప్రశ్నలకి కేంద్రం జవాబు**



గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్ ఇటీఐ)ల పనితీరు, ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన నిధులు, గ్రామీణ యువతకు అందిస్తున్న శిక్షణ, స్వయం ఉపాధి కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) లోక్‌సభలో ఈనెల 28న లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ వాటికి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా గ్రామీణ యువతకు పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రాలు సమర్పించే రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన కేంద్రం ఈ పథకం కింద నిధులను విడుదల చేస్తుందన్నారు. 2026–27లో (జులై24 నాటికి), 2023–24, 2024–25 సంవత్సరాల క్లెయిమ్‌లకు సంబంధించి రూ. 25.48 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లు అందాల్సి ఉందని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 28 జిల్లాలకుగాను ప్రస్తుతం 22 జిల్లాలను కవర్ చేస్తూ 24 ఆర్‌ఎస్ఇటీఐ కేంద్రాలు విజయవంతంగా పనిచేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వివరించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026–27) నిధులు విడుదలైన 13 జిలాల్లో నెల్లూరు జిల్లాకు రూ. 1.27 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు.




# విదేశాల్లో చదువు : అవకాశాలు, సిద్ధత.. విజయానికి మార్గదర్శిని!

ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడం భారతీయ విద్యార్థుల కోసం ఒక గొప్ప అవకాశమే కాకుండా, ఒక పెద్ద బాధ్యత కూడా. గత దశాబ్దంలో విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగిన కొద్దీ, పోటీ కూడా తీవ్రమైంది. ఒకప్పుడు మంచి మార్కులు సరిపోతే, ఇప్పుడు ఉన్నతమైన వ్యక్తిత్వం, లోతైన ఆసక్తి, మరియు స్పష్టమైన దృష్టి అవసరం. ప్రపంచ విశ్వవిద్యాలయాలు ఒక విద్యార్థిని కేవలం విద్యా ప్రతిభ ఆధారంగా కాకుండా, ఆ విద్యార్థి ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలు, పరిశోధనాసక్తి, సామాజిక బాధ్యత, మరియు వ్యక్తిగత జీవితం ఆధారంగా అంచనా వేస్తాయి. తెలుగులో ఒక సూక్తి ఉంది. 'పుస్తకంలో ఉన్న జ్ఞానం పరీక్షలో మార్కులు ఇస్తుంది; అనుభవంలో ఉన్న జ్ఞానం జీవితంలో మార్గం చూపుతుంది' అని. ఈ సూక్తి ప్రపంచ విశ్వవిద్యాలయాల అడ్మిషన్స్ తత్వానికి పూర్తిగా సరిపోతుంది. ప్రొఫైల్ అంటే విద్యార్థి యొక్క సంపూర్ణ విద్యా, వ్యక్తిత్వ ప్రతిబింబం. ఇది కేవలం ఒక రెజ్యూమే (resume) కాదు; ఇది విద్యార్థి ఎవరు, ఏం నేర్చుకున్నారు, ఏం అనుభవించారు, ఏం సాధించారు, మరియు భవిష్యత్తులో ఏ మార్పు చేయాలనుకుంటున్నారు అన్నదానికి ఒక కథనం. భారతీయ విద్యార్థులు సాధారణంగా తమ ప్రయాణాన్ని పాయింట్లుగా చూపించడానికి ప్రయత్నిస్తారు, కానీ ప్రపంచ విశ్వవిద్యాలయాలు కథను చూస్తాయి. మీ ఆసక్తి ఎలా మొదలైంది, ఏ సవాళ్లు ఎదుర్కొన్నారు, ఎలా ఎదిగారు, మరియు మీ ప్రయాణంలో ఏ మలుపులు వచ్చాయి..అన్నది అడ్మిషన్లో అత్యంత ప్రభావం చూపుతుంది.

**సంపూర్ణ వ్యక్తిత్వమే ప్రథమ మూల్యాంకనం :**

భారతీయ విద్యార్థులు ఎదుర్కొనే ప్రధాన సవాళ్లలో మొదటిది మార్కులపై అధికంగా ఆధారపడటం. భారతీయ విద్యా వ్యవస్థలో మార్కులు ప్రధాన ప్రమాణం, కానీ ప్రపంచ విశ్వవిద్యాలయాలు సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పరిశీలించే సమగ్ర మూల్యాంకనం (holistic evaluation)చేస్తాయి. మార్కులు మనసును కొలవవు; అవి కేవలం ఒక భాగం మాత్రమే. విద్యార్థి యొక్క ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించే విధానం మరియు నేర్చుకునే తత్వం కూడా అంతే ముఖ్యమైనవి. చాలామంది విద్యార్థులు "మార్కులు ఉన్నాయంటే సరిపోతుంది" అనే భావనలో ఉంటారు, కానీ ప్రపంచ స్థాయి ప్రవేశాలు ఈ భావనను దాటి మరింత లోతైన అంశాలను పరిశీలిస్తాయి. రెండవ సవాలు.. అనుభవాల లోపం. చాలామంది విద్యార్థులకు ప్రాజెక్టులు, పరిశోధన, శిక్షణలు (internships), సేవా కార్యక్రమాలు (volunteering) మరియు నాయకత్వ పాత్రలు తక్కువగా ఉంటాయి. భారతీయ విద్యా వ్యవస్థలో పాఠ్యపుస్తక జ్ఞానం ప్రధానంగా ఉండటం వల్ల అనుభవాత్మక విద్యకు తక్కువ ప్రాధాన్యం లభిస్తుంది.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

మూడవ సవాలు వ్యక్తీకరణలో బలహీనత. వ్యక్తిగత కథను స్పష్టంగా చెప్పడం, ఆలోచనలను సరిగ్గా వ్యక్తపరచడం, మరియు తమ ప్రయాణాన్ని అర్థవంతంగా వివరించడం చాలామంది విద్యార్థులకు కష్టంగా ఉంటుంది. ప్రవేశ ప్రక్రియలో అత్యంత కీలకమైన వ్యక్తిగత ప్రకటన (Statement of Purpose SOP), వ్యాసాలు(essays) మరియు ముఖాముఖి సంభాషణలు (interviews) విద్యార్థి యొక్క వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ప్రధాన సాధనాలు. నాలుగవ సవాలు..పరిశోధన అనుభవం లోపం. భారతదేశంలో undergraduate స్థాయిలో పరిశోధన అవకాశాలు పరిమితం. ప్రయోగశాలలు, పరిశోధన మార్గదర్శకులు మరియు ప్రాజెక్టు అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు తమ ఆసక్తిని లోతుగా అన్వేషించలేరు. కానీ ప్రపంచ విశ్వవిద్యాలయాలు పరిశోధన దృక్పథాన్ని అత్యంత విలువగా చూస్తాయి.

**స్వీయ అవగాహన ఎంతో కీలకం :**

ఐదవ సవాలు.."ఒకే రకమైన ప్రొఫైల్" నిర్మాణం. అందరూ ఒకే రకమైన ఆన్‌లైన్ కోర్సులు, ఒకే రకమైన శిక్షణలు మరియు ఒకే రకమైన కార్యక్రమాలు చేస్తారు. ఇది ప్రొఫైల్‌ను సాధారణంగా మార్చేస్తుంది. ప్రపంచ విశ్వ విద్యాలయాలు ప్రత్యేకతను చూస్తాయి. మీ ప్రయాణం ఎలా భిన్నంగా ఉంది, మీ ఆలోచన ఎలా ప్రత్యేకంగా ఉంది మరియు మీ కృషి ఎలా ప్రభావం చూపింది అన్నది. ఈ సవాళ్లకు తోడు, భారతీయ విద్యార్థులు ఎదుర్కొనే స్వీయ అవగాహన ఎంతో కీలక. మరో ముఖ్యమైన సమస్య "స్వీయ అవగాహన లోపం". చాలా మంది విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు, ఆసక్తులు మరియు దీర్ఘకాలిక లక్ష్యాలను స్పష్టంగా గుర్తించలేరు. వారు "ఇతరులు చేస్తున్నది నేనూ చేయాలి" అనే భావనతో ముందుకు సాగుతారు. కానీ ప్రపంచ విశ్వవిద్యాలయాలు "మీరు ఎవరు?" అనే ప్రశ్నకు నిజమైన సమాధానం కోరతాయి. స్వీయ అవగాహన లేకుండా ప్రొఫైల్ నిర్మాణం ఒక దిశలేని ప్రయాణంలా మారుతుంది. విద్యార్థి తనలోని ప్రత్యేకతను గుర్తించి, దాన్ని అభివృద్ధి చేయడం అడ్మిషన్‌లో అత్యంత కీలకమైన అంశం. ప్రొఫైల్ నిర్మాణంలో విద్యా ప్రతిభ ఒక ముఖ్యమైన భాగం. 9వ తరగతి నుండి 12వతరగతి వరకు స్థిరమైన ప్రదర్శన, బోర్డు పరీక్షల్లో మంచి స్కోర్ మరియు విషయంపై లోతైన అవగాహన అడ్మిషన్‌లో విశ్వసనీయతను ఇస్తాయి. నైపుణ్యాలు కూడా ప్రొఫైల్‌ను బలపరుస్తాయి. కోడింగ్, డేటా విశ్లేషణ, రూపకల్పన, ప్రజెంటేషన్.. ఇవి విద్యార్థి యొక్క బహుముఖప్రతిభను చూపుతాయి. సంగీతం, కళలు, క్రీడలు కూడా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రొఫైల్ నిర్మాణం ఒక పరుగు కాదు..ఒక ప్రయాణం. ఇది మార్కులకంటే పెద్దది. ఇది రెజ్యూమ్ కంటేలోతైనది. ఇది మీ వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి చూపించే ఒక అవకాశం. ప్రపంచ విశ్వవిద్యాలయాలు.. మీరు ఎలా ఆలోచిస్తారు, ఎలా నేర్చుకుంటారు, ఎలా ఎదుగుతారు, ఎలా ప్రభావం చూపుతారు అన్నది చూస్తాయి. భారతీయ విద్యార్థులకు ఇది ఒక సువర్ణ అవకాశం..సరైనప్రొఫైల్ నిర్మాణం ఉంటే ప్రపంచం మీకు తలుపులు తెరుస్తుంది.



**వచ్చే వారం:** విద్యార్థుల భవిష్యత్‌కు మార్గాలు : ఇంటర్న్‌షిప్‌లు, సేవా కార్యక్రమాలు

E-mail: reddyu@gmail.com

# శ్రీసిటీ ప్రగతి స్ఫూర్తిదాయకం

- **బిజినెస్ ఫ్యామిలీ ప్రతినిధుల బృందం ప్రశంస**




శ్రీసిటీ అధికారులతో ప్రతినిధులు

దూరదృష్టితో కూడిన ప్రణాళిక, సుస్థిర అభివృద్ధికి నిలయమైన శ్రీసిటీ ప్రగతి స్ఫూర్తిదాయకమని, పారిశ్రామికవేత్తలకు శ్రీసిటీ ఎంతో ఆదర్శంగా నిలుస్తోందని ఐక్యా కనెక్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ మరియు దినేష్ హిందూజా ఫ్యామిలీ ఆఫీస్ హెడ్ జై రూపానీ కొనియాడారు. భారతదేశంలో సమగ్ర పారిశ్రామిక అభివృద్ధికి శ్రీసిటీ ఒక ప్రమాణంగా నిలిచిందని అభినందించారు. ఇటవల దేశంలోని ప్రముఖ వ్యాపార కుటుంబాలు, ఫ్యామిలీ ఆఫీసులకు చెందిన 10 మంది ప్రతినిధులతో కూడిన బృందం శ్రీసిటీని సందర్శించింది. ఫ్యామిలీ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ 'ఐక్యా కనెక్ట్' ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. ప్రస్తుతం ఐక్యా కనెక్ట్‌కు 6 దేశాలు, 16 నగరాల నుంచి 85 సింగిల్ ఫ్యామిలీ ఆఫీసులు అనుబంధంగా ఉండగా, ఇవి కలిపి 30 బిలియన్ డాలర్లకు పైగా కుటుంబ పెట్టుబడులను నిర్వహిస్తున్నాయి. ఈ ప్రతినిధి బృందానికి అట్లాస్ ఫ్యామిలీ ఆఫీస్ ఛైర్మన్ మెహతాస్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా. సమీర్ మెహతా నాయకత్వం వహించారు. శ్రీసిటీలోని ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు బిఎఫ్‌జి, అల్‌స్టామ్, టీహెచ్‌కె, పానాసోనిక్ వంటి ప్రముఖ పరిశ్రమలను సందర్శించి వాటి తయారీ కార్యకలాపాలను ఈ బృందం పరిశీలించింది. ఈ పర్యటన ద్వారా ఫ్యామిలీ ఆఫీసుల పెట్టుబడిదారులు శ్రీసిటీ సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా అంచనా వేసే అవకాశం లభించిందని వారు చెప్తూ, తమ పర్యటనకు సహకరించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కడివేడులో కార్డెన్ సర్చ్

చిల్లకూరు మండలంలోని కడివేడులో ఈనెల 26న పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 16 మోటారు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాల సమాచారం తెలిస్తే, తమకు తెలియజేయాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

## డెంగ్యూ వ్యాధితో.. జాగ్రత్త!

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ జిల్లా మలేరియా నివారణ అధికారి మైలపల్లి సింహాచలం తెలిపారు. ఈనెల 26న నెల్లూరులో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ)ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన, స్థానిక జేమ్స్‌గార్డెన్‌లోని భాస్కర్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో జరిగిన అవగాహన కార్యక్రమం, ర్యాలీలలో ఆయన పాల్గొన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, వ్యాధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్ , జిల్లా అధ్యక్షుడు శాకవరపు వేణుగోపాల్, యుపీహెచ్‌సీ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్లు ఇచ్చినందుకు థ్యాంక్స్

జిల్లాలోని సుమారు 102 మంది పంచాయతి కార్యదర్శులకు గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5 అధికారులుగా ఉద్యోగోన్నతులు ఇచ్చినందుకు జిల్లా పంచాయతి అధికారి వసుమతికి ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా నాయకులు ఇటీవల కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, పెండింగ్‌లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కూడా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ ఛైర్మెన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గాదిరాజు రామకృష్ణ, పి.కిరణ్ కుమార్, ఆంజనేయవర్మ, ఎల్.పెంచలయ్య, కె.రాజేంద్రప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదరోగికి 4.50 లక్షల.. సీఎంఆర్ఎఫ్ సాయం



బాధిత కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ఓ నిరుపేద రోగి వైద్యానికి నాలుగున్నర లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ సాయం అందింది. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఈనెల 28న లబ్దిదారునికి ఆ చెక్కును ఆమె అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం ఇసుకపాళెం పంచాయతీ, పోలినాటి చెరువు గ్రామానికి చెందిన షేక్ ఇమాంబాషా రెండు కిడ్నీల సమస్యతో బాధపడుతున్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల కోసం వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద సాయం కోరగా, ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం, చికిత్స కోసం రూ.4,50,641 విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్‌ని మంజూరు చేసింది. దీంతో బాధితులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మకి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుద్యోగ యువతకు శుభవార్త

- **పీఎం కేవీవై ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ**

నిరుద్యోగ యువతకు ఇది శుభవార్త! డిగ్రీ, బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాలు వెతుక్కుంటున్న యువత కోసం 'ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎం కేవివై) ఉచిత స్వల్పకాలిక నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని 'విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం' ఆమేరకు శిక్షణా తరగతులను నిర్వహించనుంది. 'అప్లికేషన్ డెవలపర్-వెబ్ మరియు మొబైల్' కోర్సుకు డిగ్రీ, డిప్లొమా, పీజీ లేదా బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ శిక్షణకు అర్హులు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితం. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించడంతో పాటు, ప్లేస్‌మెంట్ (ఉద్యోగ కల్పన) అవకాశాలు కూడా కల్పిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తికలవారు ఆగస్టు 6వతేదీ ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాల కోసం స్కిల్‌డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.విజేతను సంప్రదించవచ్చని వారు తెలిపారు.

# పథకాల అమలుకు.. కేంద్రం సాయం

## రాజ్యసభలో బీఎంఆర్‌కి కేంద్రమంత్రి సమాధానం



ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంత పట్టణాల్లో వర్షపు నీటి పారుదల (స్టార్మ్ వాటర్ డ్రైనేజ్) వ్యవస్థ, వరదల నివారణ, డ్రైనేజీ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ముఖ్యంగా నెల్లూరు నగరంలో చేపట్టిన చర్యలపై ఇటీవల రాజ్య సభలో అడిగిన తన ప్రశ్నకు కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు సమాధానం ఇచ్చినట్లు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) తెలి పారు. వర్షపు నీటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలు మరియు పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని అంశమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అమృత్, మరియు అమృత్ 2.0 వంటి జాతీయ పథకాల ద్వారా రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తూ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమృత్ పథకం కింద మొత్తం 14 స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ ప్రాజెక్టులు రూ. 342.72 కోట్ల వ్యయంతో అమలవుతుండగా, వాటిలో నెల్లూరు నగరంలోనే రూ. 82.02 కోట్ల విలువైన రెండు ప్రధాన డ్రైనేజీ ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. అదేవిధంగా, అమృత్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 99 పార్కులు మరియు హరిత ప్రదేశాల అభివృద్ధికి రూ. 80.49 కోట్లు మంజూరు చేయగా, నెల్లూరులో మూడు ప్రాజెక్టులకు రూ. 2.67 కోట్లు కేటాయించారన్నారు. నెల్లూరు నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ బలోపేతానికి కేంద్రం రూ. 195 కోట్లకు పైగా కేటాయించిందని, నెల్లూరు నగరాన్ని భవిష్యత్తులో వరదల నుంచి రక్షించే విధంగా ఆధునిక స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పూర్తిచేయాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగించి పనులను వేగవంతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని బీఎంఆర్ కోరారు. నెల్లూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని తీరప్రాంత పట్టణాల్లో సమగ్ర పట్టణ వరద నిర్వహణ ప్రణాళికలను రూపొందించి, శాశ్వత డ్రైనేజీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### తల్లితండ్రుల ప్రేమకంటే..

# మించినదేమీ లేదు

బిడ్డలకు తల్లితండ్రుల ప్రేమకంటే మించినదేమీ లేదని, ప్రతిఒక్కరూ తమకు జన్మనిచ్చిన తల్లితండ్రులను ఎప్పటికీ మరచి పోకూడదని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి చెప్పారు. ఈనెల 26న ప్రపంచ తల్లితండ్రుల దినోత్సవం సంద ర్భంగా కావలి సమీపంలోని ముసునూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లితండ్రుల ప్రేమ అమృత తుల్యమన్నారు. వృద్ధాప్యంలో తల్లితండ్రు లను ఆదరించి ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని గుర్తుచేశారు.

### ఆలయాల్లో అమ్మవార్లకు..

# ఆషాఢం సారె!

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు నగరంలోని పలు దేవా లయాల్లో అమ్మవార్లకు మహిళా భక్తులు ఆషాఢం సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మూలాపేటలోని శ్రీ మూలస్థానే శ్వరుని దేవాలయంలో భువనేశ్వరిదేవి అమ్మవారికి, నెల్లూరు చెరువుగట్టున వెలసి వున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి సారెను సమర్పించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా పసుపు కుంకుమలు, చీర–గాజులు, పండ్లు పూలను సారెగా సమకూర్చి, మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించారు.

# వెంకటగిరి నుంచే పోటీ చేస్తా!

### స్పష్టం చేసిన నేదురుమల్లి రామ్



వచ్చే ఎన్నికల్లో తాను వెంకటగిరి నుంచే పోటీ చేస్తానని, ఇందులో ఎలాంటి సందేహం ఉండనక్కర లేదని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ, తాను వెంకటగిరిని వీడే ప్రసక్తే లేదన్నారు. తాను ఎంపీగా పోటీచేస్తానంటూ వచ్చే ఊహాగానాలు, ప్రచారాల్లో వాస్తవం లేదని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని, ప్రశ్నించే హక్కును హరిస్తున్నారంటూ ఆయన దుయ్యబట్టారు.

# కార్గిల్ అమరవీరులకు..ఎన్‌బికెఆర్‌లో నివాళి




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈనెల 26న ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో, అడ్మిషన్ ఇన్‌చార్జి డా. చింతా శ్రీనివాసులు సారధ్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. జాతీయజెండాలను చేతపట్టి, కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. 1999 కార్గిల్ యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా జులై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించి, విద్యార్థులకు భారత సైనికుల సాహసాలను, త్యాగాలను వివరించారు. కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## సమిష్టిగా పనిచేస్తేనే సమస్యల పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్, ఆర్డీవో అరుణకుమారి

ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అధికారులు అందరూ సమిష్టిగా పనిచేయాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ఇటీవల గూడూరు పట్టణంలోని సీసీవీఏపీయూ కార్యాలయంలో ఆర్డీవో అరుణకుమారితో కలసి అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు శాఖల పనితీరు బాగాలేదని, అధికారులు సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గానికి మంచి ర్యాంకు వచ్చేలా పనిచేయాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించాలే కాని, చుట్టూ తిప్పుకోవద్దన్నారు. అనంతరం ఆయన నివాసం వద్ద దివ్యాంగులకు మంజూరైన మూడుచక్రాల వాహనాలను అందజేశారు.



కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమంటూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాలతో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలకి అవగాహన కల్పిస్తున్న కోట మండల మాజీ అధ్యక్షులు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

# యువత విజయమే

**సీపీఐ నారాయణ**



మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా యువత విజయమేనని సీపీఐ జాతీయ కంట్రోల్ మిషన్ ఛైర్మెన్ నారాయణ తెలిపారు. ఈ నెల 26న గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో విలేకరులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మోదీ అహంకారపూరిత పాలనకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా యువత చరమగీతం పాడారన్నారు. యువజన విద్యార్థి సంఘాల ఉద్యమాలు, వామపక్ష పార్టీల మద్దతు ప్రజల శక్తి ఎలా ఉం టుందో కేంద్రానికి తెలిసివచ్చిందన్నారు. అనంతరం సీపీఐ జిల్లా నాయకులు ప్రభాకర్ సంతాపసభలో నారాయణ, మాజీఎమ్మెల్సీ విల్సన్‌తో కలిసి పాల్గొన్నారు. నాయకులు యాదాల సునీల్, శశికుమార్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్‌లో మనస్వికి గోల్డ్ మెడల్



చిల్లకూరు మండలం కృష్ణపట్నం అదాని ఫౌండేషన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన దువ్వూరు మనస్వి కేరళ రాష్ట్రంలోని తిరుచ్చిలో జరుగుతున్న అండర్ 14 రైఫిల్ షూటింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. జాతీయస్థాయిలో జరగనున్న రైఫిల్ షూటింగ్‌కు ఎంపికవడంతో అక్కడి కేరళ ప్రభుత్వం మరియు ఎయిర్ రైఫిల్ & ఎయిర్ పిస్టోల్ గేమ్స్ అథారిటీ మనస్వికి గోల్డ్ మెడల్ అందజేసి అభినందించారు.



# వేడుకగా బాబా వారి పల్లకి సేవ

గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఇటీవల బాబా వారికి పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేసి, అష్టోత్తర పూజ, మంగళ వాద్యాలతో పల్లకి సేవ వేడుకగా నిర్వహిం చారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ జనరల్ సెక్రటరీ శ్రీకంటి రామమోహన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# ఎల్‌పీపీలో ఎల్లో డే వేడుకలు



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

గూడూరు పట్టణ సమీపంలోని లిటిల్ ఏంజల్స్ పాఠశాలలో ఈ నెల 25న కిండర్‌గార్డెన్ చిన్నారుల కోసం ఎల్లో డే వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా పసుపు రంగు అలంకరణలతో కళకళలాడగా, చిన్నారులు పసుపు రంగు దుస్తులు ధరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరెస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. ఎల్లో రంగు ప్రత్యేకత, దాని ప్రాముఖ్యత, ప్రకృతిలోని పసుపు రంగు వస్తువుల గురించి చిన్నారులు చక్కగా వివరిస్తూ అందరి ప్రశం సలు అందుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ నమఃశివాయ, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలనపై.. మంత్రి ఆనం ఇంటింటి ప్రచారం


రెండేళ్ళ అభివృద్ధిని వివరిస్తూ ప్రజలకి కరపత్రాలను అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఈ రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన విజయాలను ప్రతి ఇంటా తెలిసేలా రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఆత్మకూరు పట్టణంలోని ముస్తాపురం దళితవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రి ఆనంతో పాటు ఆనం తనయ లీలా కైవల్య రెడ్డి, సీనియర్ నేత తాళ్లూరు గిరినాయుడు ఎన్డీఏ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ముస్తాపురంలో 34 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్లను మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రచ్చబండ వేదికగా మాట్లాడుతూ, 'ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు' కార్యక్రమం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 45 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గత రెండేళ్లుగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

# లోకేష్‌ని రాజీనామా చేయమనడం విడ్డూరం!


జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర

మెగా డీఎస్సీతో నిరుద్యోగుల కలలను నిజం చేసిన నారా లోకేష్‌ని వైకాపా నేత జగన్ రాజీనామా చేయమనడం ఆశ్చర్యంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అన్నారు. డీఎస్సీని, టీచర్ పోస్టుల భర్తీని ద్వేషించే జగన్‌కు, 16 వేల టీచర్ పోస్టులను ఒకేసారి భర్తీ చేసిన లోకేష్ ఎలా నచ్చుతాడని ఆయన ఎద్దేవా చేశారు. తాను చేయలేకపోయిన పనిని సమర్థవంతంగా పూర్తి చేసిన నారా లోకేష్‌ను రాజీనామా చేయాలనడం విచిత్రమన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు జగన్ కోట్లాది రూపాయలను కోర్టులకు ఖర్చు చేశారని విమర్శించారు. డీఎస్సీ పరీక్షలకు ముందు, ఆ తరువాత కూడా వైసీపీ ప్రోద్బలంతో కోర్టులలో పలు పిటిషన్లు దాఖలు చేశారని, వీటిపై ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన వాస్తవాలు, నిబంధనలను, ఆధారాలను పరిశీలించిన తర్వాత హైకోర్టు డీఎస్సీ నిర్వహణలో ఎటువంటి అక్రమాలు జరగలేదని పిటీషన్లు అన్నిటినీ కొట్టివేయడం జరిగిందని తెలిపారు. డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేసి ఏడాది గడిచిన తర్వాత డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దఎత్తున జరిగిన టీచర్ పోస్టుల భర్తీని జగన్ ఓర్వలేకపోతున్నారు. డిఎస్సీలో అవకతవకలు జరిగాయనే అబద్దాన్ని పదే పదే తమ నేతలతో చెప్పించి నిజం చేయాలని జగన్ తపనపడుతున్నారని ఆయన విమర్శించారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ మెగా డిఎస్సీ ఇచ్చింది, త్వరలో మరో డిఎస్సీ ఇవ్వనున్నది కూడా కూటమి ప్రభుత్వమేనని, ఎవరెన్ని కుట్రలు చేసినా ఉద్యోగాల భర్తీ ఆగదని ఆయన స్పష్టం చేశారు.

# విపిఆర్ చొరవతో.. ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


ఫౌంటెన్‌ని ప్రారంభిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్, ఎన్టీఆర్ పార్క్‌లో 26 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ఫౌంటెన్‌కు ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పార్కును దత్తత తీసుకోమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (విపిఆర్)ని తాను ప్రత్యేకంగా కోరానని, అడిగిన వెంటనే కాదనకుండా పార్కును దత్తత తీసుకున్న విపిఆర్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. మాట చెప్పడమే కాకుండా ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి అన్నిరకాల చర్యలు చేపడుతున్న వేమిరెడ్డికి ప్రజలపక్షాన ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఆయన చొరవతో ఎన్టీఆర్ పార్కు అద్భుతంగా ఉంటుందన్నారు. నెల్లూరు రూరల్‌లో పార్కుల ఏర్పాటు బాధ్యత తనదని, పార్కుల నిర్వహణ బాధ్యత స్థానిక ప్రజలు చేపడితే ఇక్కడి పార్కులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ నూకరాజు మదన్‌కుమార్ రెడ్డి, 19వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొప్పూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని సంస్కరించేది గురువులే!

- ఆచార్య మాడభూషి -


మాడభూషిని సన్మానిస్తున్న పరిశోధక విద్యార్థులు

సమాజాన్ని సంస్కరించేది, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దేది గురువులేనని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. వెంకటాచలం మండలంలోని సరస్వతి నగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలను, మహాభారతాన్ని, అష్టాదశ పురాణాలను సృజించిన వేదవ్యాసుని ఆదిగురువుగా భావించి ఆయన పుట్టినరోజు ఆషాఢ పౌర్ణమి నాడు గురుపౌర్ణమి జరుపుకుంటారని తెలిపారు. ఈ రోజున ప్రతి ఒక్కరూ తమ గురువులను పూజిస్తారని తెలిపారు. అనంతరం ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌ను ఆ కేంద్రం విద్యాత్మక సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

# మంచి పనులపైనా బురద చల్లడమేనా?

## • మంత్రి నారాయణ మండిపాటు


అభివృద్ధి కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి నారాయణ

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నా ప్రతిపక్షాలు, వైకాపా వారు గందరగోళం సృష్టిస్తుండడం పట్ల రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ మండిపడ్డారు. నెల్లూరులోని 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా, తమ కూటమి ప్రభుత్వం వేలాది పోస్టులను భర్తీ చేస్తుంటే అనవసరంగా రాజకీయం చేస్తున్నారని, నెల్లూరు అభివృద్ధిలో భాగంగా ప్రతి 5 మీటర్లకు ఉచితంగా ఒక చెట్టును నాటించినా అవినీతి రంగు పులిమారని, విద్యార్థులకు పంపిణీ చేసిన 7,000 సైకిళ్లపై కూడా బురద చల్లుతున్నారని మండిపడ్డారు. మంచి పనులను అభినందించకుండా బురద చల్లడం మంచిపద్ధతి కాదన్నారు.

# బుచ్చిలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయండి

## • ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మెన్‌కి..ఎంపీ వేమిరెడ్డి లేఖ



నెల్లూరు పార్లమెంటు పరిధిలోని కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (విపిఆర్) ఈనెల28న లేఖ రాశారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణ పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-67 (చుంచులూరు నుంచి నెల్లూరు వెళ్లే మార్గం) కిలోమీటర్ 722.33 నుంచి 724.800 వద్ద రూ.14 కోట్ల అంచనా వ్యయంతో భారీ వాహనాల రద్దీని, భారాన్ని తట్టుకునేలా భారాన్ని తట్టుకునే పేవర్ బ్లాక్స్ నిర్మాణ పనులను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. పట్టణ ప్రాముఖ్యత, ప్రజల ప్రాణరక్షణను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికే దీనిపై రూ.14 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని, ఈ ప్రతిపాదనను ఎన్‌హెచ్‌ఏఐ ప్రాధాన్య ప్రాజెక్టుగా పరిగణించి పనులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని విపిఆర్ విజ్ఞప్తిచేశారు.

# జొన్నవాడలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## • ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన 40కిలోవాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ మరియు పునరుద్ధరించిన దేవస్థాన పరిపాలనా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు నెల్లూరు నందిని రైస్ అండ్ బాయిల్డ్ రైస్ మిల్ యజమానులు చలువాది మల్లికార్జునరావు, వారి సతీమణి శ్రీమతి లక్ష్మి శివకుమారి, మారేపల్లి చంద్రశేఖర్‌రెడ్డి-మనోరమారెడ్డి దంపతులు విరాళాలు అందించగా, మిగిలిన మొత్తాన్ని దేవస్థానం నిధులతో ఈ ప్రాజెక్టును పూర్తిచేశారు.

### అమ్మవారికి ఆషాఢం సారె..

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలతో అత్యంత వైభవంగా అలంకరించిన శాకాంబరీ స్వరూపిణి శ్రీ కామాక్షితాయి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ మాస సారెను సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉండాలని ఆమె ప్రార్థించారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధికి సహకరించిన దాతలను దేవస్థానం అధికారులను, వారి సేవాస్ఫూర్తిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు

# జనసేన అభినందన



ఎమ్మెల్యే సోమిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న జనసేన నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, సమస్య తెలిసిన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్ గునుకుల ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఓ గ్రామంలో స్థలం సమస్య కారణంగా ఓ వృద్ధ దంపతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల పట్ల ఆయన చూపిన బాధ్యత, స్పందనాభావం ఆదర్శనీయమని సోమిరెడ్డిని కలసి అభినందించారు. జనసేన నాయకులు ప్రశాంత్ గౌడ్, చిత్తూరు బాలాజీ, హేమచంద్ర యాదవ్, అశోక్, బాలు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 'ధరణి' ఆధ్వర్యంలో..వాటర్ ప్లాంట్లు!



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న యల్లాల రఘురామిరెడ్డి

వింజమూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మరియు ఊటుకూరులోని జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు మరియు సమీప గ్రామస్తుల త్రాగునీటి అవసరాల కోసం విర్కో పెట్రో కెమికల్స్, హైదరాబాదు వారి ఆర్థిక సహాయంతో, వింజమూరుకు చెందిన ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల రెండు త్రాగునీటి వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ధరణి సేవా సమితి కార్యదర్శి యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడుతూ ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ యల్లాల మంజుల, గౌరవ సలహాదారు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి సూచనలతో, జిల్లాలోని అభివృద్ధి చెందని ప్రాంతాలైన ఉదయగిరి మరియు ఆత్మకూరు నియోజకవర్గాల గ్రామాలలో త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం 23 ప్రాంతాలలో ఇప్పటివరకు దాదాపు కోటి రూపాయలు విలువైన 23 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. వింజమూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు హైమావతి మాట్లాడుతూ వింజమూరు మండలానికి రెండు వాటర్ ప్లాంట్లు మంజూరు చేసిన విర్కో పెట్రో కెమికల్స్ అధినేతలు నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ ఏవీఎస్ సూర్యనారాయణరాజు, పక్కన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

# బాలల హక్కులను పరిరక్షిస్తాం

బాలల హక్కులను పరిరక్షించడంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఎక్కడైనా పిల్లలపై వేధింపులు, దోపిడీ, బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినట్లు తెలిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సురక్షితంగా, విద్యావంతుడిగా, ఆరోగ్యవంతంగా ఎదిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగు తోందని స్పష్టం చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని చైర్మన్ స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారు, బాల్య వివాహాలకు పాల్పడే వారు, చిన్నారులను డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి నేరాలకు వినియోగించే ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కెజీ వెంకట పద్మలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి..లక్ష విరాళం



ఈఓ శ్రీనివాసులురెడ్డికి విరాళాన్నందజేస్తున్న దాతలు

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఇటీవల నెల్లూరు వాస్తవ్యులు గడియపూడి శ్రీనివాసరావు–శ్రీవిద్య దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. ఆ మొత్తాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత గోత్రనామాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ చైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# పెనుబల్లిలో హోమియో వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 28న ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్య ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. హోమియో మందులతో అనేకవ్యాధులు నయమవుతాయన్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులిచ్చారు. కంపౌండర్ సుధాకర్‌రావు, టీచర్లు మాధవరావు, శీనయ్య, యోగ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

## టూకీగా...



### తూర్పు జంగాలపల్లిలో పోలీసుల తనిఖీలు

జిల్లావ్యాప్తంగా నేర నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు జరుగుతున్న కార్డెన్‌సర్చ్‌లో భాగంగా పోలీసులు ఈనెల 28న కొండాపురం మండలం తూర్పు జంగాలపల్లిలో ఇంటింటినీ తనిఖీ చేశారు. కలిగిరి సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఇళ్లలో ఉన్నవారి వివరాలు తెలుసుకున్నారు. వాహనాలకు సరైన పత్రాలున్నాయా లేదా అని పరిశీలించారు.

### గొల్లకందుకూరులో.. పొలం పిలుస్తోంది

నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు ఈనెల 28న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్‌వి నాగమోహన్, సహాయ వ్యవసాయ సంచాలకు రాలు బి.శ్రీదేవి పాల్గొని వరి రైతులు పంటల బీమా చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు.

### ఏఎస్‌పేటలో గంజాయి నిరోధంపై అవగాహన

మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ఈనెల 28న పోలీసులు గంజాయి తదితర మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధంపై ప్రజలకు అవగాహన కలిగించారు. వాటిని వాడడం, కలిగి వుండడం నేరమని, వాటివల్ల జీవితాలు నాశనమవుతాయని తెలియజెప్పారు. అందరూ వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ కె.జిలానీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### కోదండరామపురంలో.. పోలేరమ్మకి ప్రత్యేక పూజలు

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మనుబోలు మండలం లోని కోదండరామపురం గ్రామంలో శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 28న ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అద్వితీయం..విరాటపర్వం



విద్వన్మణి బులుసు అపర్ణను సన్మానిస్తున్న వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు

తిక్కన మహాభారతంలోని విరాటపర్వం అద్వితీయమైనదని, అందులో తిక్కన నాటకీయత నవరసభరితమని విద్వన్మణి బులుసు అపర్ణ (భీమడోలు) కొనియాడారు. ఈనెల 26న చెన్నైలోని వేద విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో టీనగర్ ఆంధ్రాక్లబ్–కృష్ణా హాలులో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఆమె 175వ సారస్వతోపన్యాసం చేశారు. 'విరాటపర్వం –తిక్కన నాటకీయత' అనే అంశంపై అద్భుతంగా ప్రసంగించి వేదిక అధ్యక్షులు జెకెరెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఆధ్వర్యంలో సన్మానం స్వీకరించారు. చెన్నైలోని అనేకమంది తెలుగు సారస్వ తాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి ఆశాజ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2026 శనివారం ఆ మహనీయుని 49వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారుడు
మాగుంట శ్రీనివాసులురెడ్డి
ఎం.పి, ఒంగోలు.

మనుమళ్ళు
మాగుంట కిరణ్‌రెడ్డి
మాగుంట రాఘవ్‌రెడ్డి
మాగుంట నిఖిల్‌రెడ్డి

మునిమనవడు
మాగుంట సుబ్బరామ్‌రెడ్డి

# 'ఛేంజ్ మేకర్'..మన సతీష్‌రెడ్డి!

## మెగాస్టార్ చిరంజీవి నుంచి అవార్డు స్వీకారం



డా. సతీష్‌రెడ్డి దంపతులకి అవార్డునందజేస్తున్న మెగాస్టార్ చిరంజీవి పక్కన కె.వి.పి.రామచంద్రరావు, మంత్రి సత్యకుమార్‌యాదవ్ తదితరులు

***జిల్లాకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, దేశ రక్షణరంగంలో అపారమైన ప్రతిభతో ఎన్నో పరిశోధనలు చేస్తూ శాస్త్ర సాంకేతికరంగంలో దేశానికి స్ఫూర్తిదాయకమైన సేవలందిస్తున్న డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, జాతీయ భద్రతా మండలి సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ఏరో డిఫెన్స్ సలహాదారు డా.గుండ్రా సతీష్‌రెడ్డికి ఇటీవల ప్రతిష్టాత్మకమైన 'ఛేంజ్‌మేకర్-2026 పురస్కారం లభించింది. కార్గిల్ విజయ దివస్ రోజునే రక్షణ రంగ శాస్త్రవేత్తగా ఆయన ఛేంజ్‌మేకర్ అవార్డును అందుకోవడం జిల్లాకే కాదు, భారతీయులందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా డా.సతీష్‌రెడ్డి ఆ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తదితరులు డా. సతీష్‌రెడ్డి సేవలను కొనియాడారు. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు.. పద్మభూషణ్ డా. కేఐ వరప్రసాద్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి సాధించిన విజయాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని చిరంజీవి, ఎమెస్కో విజయ్‌కుమార్‌లు ఆవిష్కరించారు.***

### అద్భుతమైన సాంకేతికత..భారత్ సొంతం - సతీష్‌రెడ్డి

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు దివంగత డాక్టర్ బీవీ పట్టాభిరాం స్మారకార్థం 'ఎమెస్కో-డాక్టర్ బీవీ పట్టాభిరాం' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక 'ఛేంజ్ మేకర్-2026' పురస్కార కార్యక్రమం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో ఆదివారం వైభవంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖుల సమక్షంలో ప్రముఖ సినీనటులు, మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా డాక్టర్ సతీష్‌రెడ్డి దంపతులు ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, తనకు లభించిన ఈ 'ఛేంజ్ మేకర్' అవార్డును దేశ రక్షణ రంగంలో సేవలందిస్తున్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. రక్షణ రంగంలో మనదేశం త్వరలోనే గ్లోబల్ సూపర్ పవర్‌గా మారనుందని, ఒకే క్షిపణితో మూడు వేరువేరు లక్ష్యాలను సాధించే అద్భుత సాంకేతిక భారత్ సొంతమని ఆయన చెప్పారు. ప్రపంచంలో శక్తివంతమైన రక్షణ ఉత్పత్తులను తయారుచేసే దేశాల జాబితాలో భారత్ ఇప్పుడు 4వ స్థానానికి చేరుకుందన్నారు. క్షిపణుల నిర్మాణంలో మన దేశం ఇకపై ఏ ఇతర దేశంపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధ్వని వేగం కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే క్షిపణులు, అత్యంత దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించే అత్యాధునిక గన్స్ కలిగిన ఏకైక దేశం భారత దేశమేనని పేర్కొన్నారు.

### సతీష్‌రెడ్డి ప్రతిభా పాటవాలు అమోఘం - మంత్రి సత్యకుమార్

సతీష్‌రెడ్డి ప్రతిభా పాటవాలు అమోఘమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సత్యకుమార్ కొనియాడారు. ఏపీ ప్రభుత్వ సలహాదారుడిగా రాష్ట్రానికి రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో భారీగా పెట్టుబడులు తీసుకు రావడంలో డాక్టర్ సతీష్‌రెడ్డి కృషిని ఆయన ప్రశంసించారు. డాక్టర్ సతీష్ ప్రతిభను 30 ఏళ్ల క్రితం విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి సత్య గుర్తు చేశారు.


### దేశం గర్వించే వ్యక్తి డా. సతీస్‌రెడ్డి - మెగాస్టార్ చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. గొప్ప వ్యక్తులు ఎప్పుడూ అతి సామాన్యంగా ఉంటారనడానికి డాక్టర్ సతీష్‌రెడ్డి నిదర్శనమన్నారు. మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం తరువాత అంతటి సామర్థ్యం ఉన్నటువంటి దేశం గర్వించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది డాక్టర్ సతీష్ రెడ్డేనని ప్రశంసించారు. నెల్లూరు జిల్లాలోని ఒక మారుమూల పల్లెటూరు నుంచి తమ ప్రస్థానం సాగించి అంతర్జాతీయ స్థాయిలో బ్రిటిష్ సొసైటీ ఆఫ్ ఏరోనాటికల్, అలాగే అమెరికన్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న డాక్టర్ సతీష్ రెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు..పద్మభూషణ్ డా. కేఐ వరప్రసాద్ రెడ్డి, ఏపీ హైకోర్టు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ నరసింహారెడ్డి, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీనియర్ ఐఏఎస్ అధికారులు ఎల్‌వి సుబ్రహ్మణ్యం, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, జయా పట్టాభిరామ్‌లతో పాటు పలువురు రక్షణ రంగ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# దైన్యంగా మారిన బాల్యం!

***బాల్యం అంటే ఆటలు, చదువు, కలలు, భవిష్యత్తు. కానీ మన దేశంలోని లక్షలాది మంది చిన్నారులకి బాల్యం అంటే ఇటుక బట్టీలు, టీ దుకాణాలు, గ్యారేజీలు, వ్యవసాయ పొలాలు, గనులు, చిన్న పరిశ్రమల్లో చెమటోడ్చడం. పుస్తకాలు చేత పట్టాల్సిన చిన్నారులు పనిముట్లు పట్టడం, పాఠశాలకు వెళ్లాల్సిన కాళ్లు ఉపాధి కోసం తిరగడం నేటి భారత సమాజంలో జరుగుతున్న ఒక చేదు వాస్తవం. రాజ్యాంగం పిల్లలకు విద్య, రక్షణ, గౌరవప్రదమైన జీవితం హామీ ఇచ్చినప్పటికీ, బాల కార్మిక వ్యవస్థ ఇంకా పూర్తిగా అంతరించలేదు.***



## భారత్‌లో పెరిగిపోతున్న బాలకార్మికులు

### ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు!

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలైన ILO (International Labour Organization) మరియు UNICEF సంయుక్త నివేదిక (2021) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు 16 కోట్ల మంది పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. భారత్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం 5-14 సంవత్సరాల వయస్సులో 1.01కోట్ల(10.1 మిలియన్లు) మంది బాల కార్మికులు ఉన్నారు. వీరిలో సుమారు 56 లక్షల మంది బాలురు, 45 లక్షల మంది బాలికలు. అదే సమయంలో 15-18 సంవత్సరాల వయస్సు గల మరో 2 కోట్లకు పైగా టీనేజర్లు విద్యని పక్కన పెట్టి వివిధ రంగాల్లో పనిచేస్తున్నట్లు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సర్వేలు సూచిస్తున్నాయి. కోవిడ్-19 అనంతరం పేదరికం, పాఠశాలల మూసివేత, కుటుంబాల ఆర్థిక సంక్షోభం కారణంగా బాల కార్మికుల సంఖ్య మరింత పెరిగిందని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

### ఏ రంగాల్లో ఎక్కువ?

భారత్‌లో బాల కార్మికులు ప్రధానంగా...

➢ వ్యవసాయ రంగం - సుమారు 55-60%
➢ చిన్న పరిశ్రమలు, తయారీ రంగం - 20-25%
➢ హోటళ్లు, టీ దుకాణాలు, గృహ సేవలు, నిర్మాణ రంగం - 15-20%
➢ ప్రమాదకర పరిశ్రమలు (పటాకులు, గనులు, రసాయన పరిశ్రమలు, కార్పెట్, బీడీ పరిశ్రమలు)లో వేలాది మంది చిన్నారులు పనిచేస్తున్నారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది.

పేదరికం బాల కార్మికత్వానికి ప్రధాన మూలం. కుటుంబ పోషణ కోసం చిన్నారులను పనిలోకి పంపడం ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కొనసాగుతోంది. విద్యకు దూరం కావడం మరో ముఖ్యకారణం. పాఠశాల మానేసిన పిల్లలు మరో ప్రత్యామ్నాయం కనిపించక బాల కార్మికులుగా మారుతున్నారు. వలస కూలీల కుటుంబాలు, అప్పుల ఊబి, నిరక్షరాస్యత, చౌక శ్రమ కోసం యజమానుల డిమాండ్, చట్టాల అమలులో నిర్లక్ష్యం కూడా ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి.

బాల కార్మికత్వం పిల్లల బాల్యాన్ని మాత్రమే కాదు, వారి భవిష్యత్తునూ దెబ్బతీస్తుంది.

➢ విద్యకు శాశ్వతంగా దూరమవుతారు.
➢ శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
➢ ప్రమాదకర పనుల వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి.
➢ తక్కువ వేతనాలతో జీవితాంతం పేదరిక చక్రంలోనే చిక్కుకుపోతారు.

### పేరుకి మాత్రమే అన్నట్లుగా మన చట్టాలు!

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య హక్కు కల్పించింది.

Child and Adolescent Labour (Prohibition and Regulation) Act, 1986ను 2016లో సవరించి, 14 ఏళ్ల లోపు పిల్లలను ఉద్యోగాల్లో నియమించదాన్ని నిషేధించింది. అలాగే ప్రమాదకర పరిశ్రమల్లో 18 ఏళ్లలోపు వారికి సైతం ఉపాధి కల్పించకూడదనే నిబంధన విధించింది. అయితే కుటుంబ ఆధారిత వృత్తుల్లో పనిచేయడానికి కొన్ని మినహాయింపులు ఉండటంపై కూడా బాలల హక్కుల సంఘాలు పలు సందర్భాలలో తమ అభ్యంతరం వ్యక్తం చేశాయి, ఇప్పటికీ చేస్తున్నాయి.

### నామ మాత్రంగా ప్రభుత్వ చర్యలు!

కేంద్ర ప్రభుత్వం PENCIL (Platform for Effective Enforcement for No Child Labour) పోర్టల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి రక్షణ చర్యలు చేపడుతోంది. సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు (NCLP) వంటి కార్యక్రమాలు పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు ఉపయోగపడుతున్నాయి. అయితే వీటి అమలు గ్రామీణ, పట్టణ పేద ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా జరగాల్సిన అవసరం ఉంది.

### సమాజం పాత్ర కూడా కీలకమే!

బాల కార్మిక సమస్యను ప్రభుత్వం ఒక్కటే పరిష్కరించలేదు. ప్రతి పౌరుడి బాధ్యత కూడా ఉంది.

➢ బాల కార్మికులను ఉద్యోగాల్లో పెట్టకూడదు.
➢ కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.
➢ పేద కుటుంబాలకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి.
➢ స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు ఒక ఉద్యమంలా పనిచేసి పిల్లలను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావాలి.

ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ భావిపౌరుల చేతుల్లో ఉంటుంది. అలాంటి పసివారి చేతుల్లో పుస్తకాలకి బదులుగా పనిముట్లు కనిపించడం అభివృద్ధి చెందుతున్న భారతానికి మంచిది కాదు. బాల కార్మికత్వాన్ని నిర్మూలించడం అన్నది కేవలం చట్టపరమైన బాధ్యత కాదు, అది సామాజిక, నైతిక బాధ్యత కూడా. ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండే రోజు వచ్చినప్పుడే "అభివృద్ధి చెందిన భారత్" అనే కల నిజమవుతుంది. పరిపూర్ణ అక్షరాస్యతతో భారత్ ప్రగతిపథం వైపు పరుగులు తీస్తుంది. బాల్యం బతకాలి... బాల కార్మికత్వం అంతరించాలి. అదే నిజమైన స్వాతంత్ర్యానికి, సమానత్వానికి, సామాజిక న్యాయానికి ప్రతీక.

" మేరా భారత్ మహాన్"...!




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com